2nd pages1.qxd 6/7/2025 7:40 PM Page 1

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 214 విశాఖపట్నం, 8 జూన్ 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

**మంచిమాట**

'మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి, బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండి'

- స్వామీ వివేకానంద



తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.



# చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటాం

- టెలీకాన్ఫరెన్స్‌లో టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు హెచ్చరిక
- ప్రతి ఒక్కరి పనితీరుపై సర్వేలు చేయిస్తున్నామని వెల్లడి
- ఏడాది పాలనపై 12న నియోజకవర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు



**అమరావతి, విశాఖ సమాచారం:** రాష్ట్రాభివృద్ధిలో ఏడాది కాలంలో స్పష్టమైన మార్పు చూపించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. టీడీపీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. "పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరుపై సర్వేలు చేయిస్తున్నాం. బాగా పనిచేసిన వారికి ప్రోత్సాహం ఉంటుంది. పార్టీ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటాం. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలి. ప్రజలు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి. వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది నా ఆలోచన. ప్రజలు అన్నీ గమనిస్తారు.. జాగ్రత్తగా ఉండాలి మనం తీసుకునే నిర్ణయాలతోనే మంచి ఫలితాలు వస్తున్నాయి. గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు ఏకపక్షంగా మనల్ని గెలిపించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు ఉంటాయి. మంచి చేస్తే అభినందిస్తా.. తప్పు చేస్తే దూరం పెడతా. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తా. ఎవరు ఎంత అడ్డుపడినా రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు. ఈ నెల 12 లేదా 14 లోపే తల్లికి వందనం ...(మిగతా 2లో)

## 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

**అమరావతి, విశాఖ సమాచారం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలమైన ఏఐ వ్యవస్థ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఎన్‌విడియాతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ సంస్థ మద్దతులో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. ...(మిగతా 2లో)

# అప్పన్న దర్శనానికి పోటెత్తిన జనం

### భక్తులకు మజ్జిగ, పిల్లలకు పాలు బిస్కెట్లు పంపిణీ



**సింహాచలం, విశాఖ సమాచారం:** ఉత్తరాంధ్ర కోస్తా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సింహగిరిపై .అప్పన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు శనివారం పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తరాంధ్ర కోస్తా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు వేకువ జాము నుంచే భక్తులు సింహగిరిని చేరుకోవడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి భక్తులకు కావలసిన సౌకర్యాలను పర్యవేక్షిస్తూ వారికి కావలసిన అన్ని ఏర్పాట్లపై ఉద్యోగులకు తగు సూచనలు చేస్తూ వేసవి దృష్టిలో ఉంచుకొని భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లల కోసం పాలు బిస్కెట్లు పంపిణీ చేయించారు. కేశఖండన, ప్రసాదాల వద్ద, 100 రూపాయలు 300 రూపాయలు, ఉచిత క్యూ లైన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు త్వరితగతిన దర్శనాలు కలిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆలయం, ప్రసాద కౌంటర్లు, గోపురం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా శానిటేషన్ పనులను పరిశీలించారు. ...(మిగతా 2లో)



# ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్...

### ఐదుగురు మావోయిస్టులు మృతి

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం గత కొన్ని రోజులుగా కాల్పుల మోతతో దద్దరిల్లుతోంది. బీజాపుర్ జిల్లాలోని నేషనల్ పార్క్‌లో జరుగుతున్న ఆపరేషన్‌లో మూడో రోజు మరో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనాస్థలిలో రెండు ఏకే 47 రైఫిళ్లు, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీహైడ్రేషన్, పాముకాటు, తేనెటీగలు దాడి చేయడంతో కొందరు జవాన్లకు అస్వస్థత కలిగింది. గాలింపు సమయంలో మరికొందరు జవాన్లకు గాయాలయ్యాయి. గత మూడు రోజులుగా నేషనల్ పార్క్‌లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆపరేషన్ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. గడిచిన రెండు రోజుల్లో మావోయిస్టు అగ్రనేతలు ...(మిగతా 2లో)

# ప్రైవేట్‌కు దీటుగా కేజీహెచ్‌లో ఆధునిక సదుపాయాలు

### ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### కేజీహెచ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్, పలు వార్డుల వద్ద షెడ్లు ప్రారంభం

### ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ శంఖ బ్రాత బాగ్చి



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** కేజీహెచ్‌లో మార్చురీ వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్ , టెస్లా సెంటర్, ఫార్మసీ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లను దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ శంఖ బ్రాత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేజీహెచ్ లో మెరుగైన సదుపాయాలు కల్పనకు నిరంతర కృషి చేస్తున్నానని , ప్రణాళిక ప్రకారం మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కేజీహెచ్ ను ఉన్నతంగా తీర్చి దిద్దడంలో స్థానిక వైద్య సిబ్బంది కృషి చేస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. కేజీహెచ్ లో వైద్య సిబ్బందికి , రోగులకు, రోగుల కుటుంబ సభ్యులకు నిరంతరం మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద, స్థానిక కార్పొరేటర్ అప్పల రత్నం, వార్డు జనసేన అధ్యక్షురాలు యజ్ఞశ్రీ గారు, పలు విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ సెక్రటేరియట్‌లో ఉద్యోగాల పేరుతో టోకరా

### నిందితుల అరెస్టు



**విజయనగరం, విశాఖ సమాచారం:** ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఏడుగురు నిరుద్యోగుల నుంచి రూ. 53 లక్షలు వసూలు చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను సృష్టించి నిందితులు రూ.53 లక్షలు కాజేశారు. ఈ మేరకు నలుగురిని ఒకటో పట్టణం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.6 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు శనివారం మీడియాకు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ప్రదీప్ నగర్‌కు చెందిన నిందితుడు కె.సాయి వెంకట్ సుజిత్.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఆసక్తి ఉన్నవారు తనను సంప్రదంచాలని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దానిని చూసిన విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన ఏడుగురు నిరుద్యోగ యువకులు సుజీత్‌ను సంప్రదించారు. విజయవాడలోని సెక్రటేరియట్‌లో పలు ప్రభుత్వ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు వేయిస్తామని చెప్పి వారి నుంచి రూ.53 లక్షలు తీసుకొని మోసం చేశాడు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సృష్టించి వారికి అందించారు. ఏడుగురు బాధితులను విజయవాడ తీసుకొచ్చి నెల రోజుల పాటు అక్కడే ఉంచారు. తొందర్లోనే మీకు సమచారం ఇస్తామని చెప్పి వారిని వెళ్లిపొమ్మన్నారు. ఎంతకీ ఎలాంటి సమాచారం రాకపోవడంతో బాధితుల్లో ఒకరైన ఎస్.కోటకు చెందిన ఎస్.వినోద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో ఐదుగురు ఏపీ వాసులు, నలుగురు హైదరాబాద్‌కు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు అయిందనే విషయం ...(మిగతా 2లో)




# ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**అమరావతి, విశాఖ సమాచారం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల అయ్యాయి. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఆంధ్ర ప్రదేశ్ ( బిఐఏపి) ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షలకు ...(మిగతా 2లో)

# మూలపేట పోర్టు నిర్మాణ పనులు 50 శాతం పూర్తి

- శరవేగంగా బెర్తుల నిర్మాణం
- త్వరలో 'ట్రయల్ రన్'కు సన్నాహాలు



**శ్రీకాకుళం, విశాఖ సమాచారం:** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో తలపెట్టిన మూలపేట పోర్టు నిర్మాణ పనులు 50 శాతం మేర పూర్తయ్యాయి. వైసీపీ హయాంలో ఈ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. కీలకమైన బెర్తుల పైలింగ్ పనులు పూర్తయ్యాయి. మొత్తం 3 జనరల్ బెర్తులు, 1 కోల్ బెర్తు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వీటిల్లో ఒక జనరల్ బెర్తు పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మూలపేట పోర్టు నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ఓ వైపు పనులు ...(మిగతా 2లో)

# మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కన్నుమూత

### ప్రముఖుల సంతాపం





**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం(93) ...(మిగతా 2లో)

2nd pages1.qxd 6/7/2025 7:40 PM Page 2



# జగన్ మళ్లీ సీఎం అయ్యాక 3 రాజధానుల జోలికెళ్లం

## - జోగి రమేష్ వీడియో వైరల్



**అమరావతి, విశాఖ సమాచారం:** మూడు రాజధానులపై వైసీపీ పార్టీ యూ టర్న్ తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ మేరకు ఆ పార్టీ మాజీ మంత్రి జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మరాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఆయన స్పందించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోలో జోగి రమేష్ ఏపీ రాజధాని అమరావతి.. ఇక నుంచి రాష్ట్రానికి సింగిల్ రాజధాని అని, గతంలో 3 రాజధానుల సిద్ధాంతం వల్ల వైసీపీ తీవ్రంగా నష్టపోయిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రజలు ఇంతటి తీర్పు ఇచ్చిన తర్వాత మేం మూడు రాజధానుల జోలికి వెళ్లమని, జగన్ మళ్లీ సీఎం అయ్యాక అమరావతిలోనే రాజధాని నిర్మాణం కొనసాగిస్తామని చెప్పుకొచ్చారు. అలాగే రాజధాని కోసం పాదయాత్ర చేస్తున్న అమరావతి రైతులపై దాడులు తప్పేనని తమకు ఆ విషయం ఇప్పుడు తెలిసొచ్చిందన్నారు.

అలాగే రాష్ట్ర అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పై చేసిన కామెంట్స్ కారణంగా తన భార్య తనను నిలదీసిందని,అసెంబ్లీకి వెళ్లేది ఇటువంటి పనికిమాలిన మాటలు మాట్లాడేందుకేనా? చంద్రబాబు సతీమణిపై అలా మాట్లాడొచ్చా? అని మమ్మల్ని ప్రశ్నించిదని, తాము అలాంటి మాటలు మాట్లాడటం తప్పేనని జోగి రమేష్ అంగీకరించారు. తాము అసెంబ్లీలో మాజీ సీఎం భార్య పై చేసిన వ్యాఖ్యలు కూడా వైసీపీ ఓటమికి ఓ కారణమని ఆయన వెల్లడించారు. దీంతో ఆ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. చాలా లేటుగా జోగి రమేష్ రియలైజ్ అయ్యాడని కామెంట్స్ చేస్తున్నారు. అలాగే.. మాజీ మంత్రి జోగి రమేష్.. వైసీపీ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను.. సానుభూతిగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాడని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు.

# మహిళలపై అసభ్య వ్యాఖ్యలతో పైశాచిక ఆనందం

## మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, విశాఖ సమాచారం:** మహిళలపై వైసీపీ భజన బృందం, సైకో బ్యాచ్ అసభ్య వ్యాఖ్యలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డలను అవమానించేలా మాట్లాడిన ఏ వ్యక్తినైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల ముసుగులో కొందరు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సాక్షి మీడియాలో కూర్చుని చేసిన వ్యాఖ్యలు యావత్ మహిళా లోకాన్నే తీవ్ర మనోవేదనకు గురి చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో 11 స్థానాలకు పరిమితం చేసి బుద్ధి చెప్పినా సిగ్గురాలేదని, ఇంకా అమరావతి, ఆ ప్రాంత మహిళా రైతులపై విషం కక్కడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. టీవీ చర్చలు ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని అన్నారు. జుగుప్సాకర వ్యాఖ్యలతో మహిళలను కించపరిచేవారు మనుషులేనా అని నిలదీశారు. గత పాలకులు ఎక్కడి నుంచి పాలన చేశారని, అమరావతిలో కాదా అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత జగన్‌కు మహిళల పట్ల గౌరవం లేకనే తన పార్టీ నేతల్ని కూడా విలువల్లేని వారిగా తయారు చేశారన్నారు. మహిళలపై మరో మారు నోరు జారితే వేరే రూపంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ మేరకు గొట్టిపాటి రవి కుమార్ ట్వీట్ చేశారు.

# నాయకులపై విచారణ తర్వాతే చేర్చుకుంటాం

## - టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**అమరావతి, విశాఖ సమాచారం:** పార్టీలో చేరికలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశానుసారం ఇతరులను చేర్చుకునే ముందు తప్పనిసరిగా పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలపాలన్నారు. పార్టీలోకి వస్తామనే వారిపై పూర్తిగా విచారణ చేశాకే ఆహ్వానించాలని చెప్పారు. వివిధ హోదాల్లో ఉన్న నాయకులంతా ఈ విషయం గమనించాలని సూచించారు. ఈమేరకు పల్లా శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు.

# తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై నిరీక్షణకు తెరపడింది. కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశముంది. కొత్తగా ముగ్గురు లేదా నలుగురికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి మంతనాలు సాగిస్తున్నారు. ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయించాలి? సామాజిక వర్గాల సమీకరణ ఎలా ఉండాలన్న దానిపై చర్చిస్తున్నారు. పార్టీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే చర్చలు పూర్తి చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్...

(మొదటి పేజీ తరువాయి)

సుధాకర్, భాస్కర్ మృతి చెందారు. సుధాకర్‌పై రూ.కోటి, భాస్కర్‌పై రూ.25లక్షల రివార్డ్ ఉంది. ప్రస్తుతం ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని భద్రతా బలగాలు వెల్లడించాయి. 80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నేషనల్ పార్క్ అటవీ ప్రాంతాన్ని మావోయిస్టులు తమకు సురక్షిత ప్రాంతంగా భావించారు. ఈ విస్తీర్ణంలో ఒక్క పోలీస్ స్టేషన్ గానీ.. క్యాంప్ గానీ లేదు. దాన్ని మావోయిస్టులు అవకాశంగా తీసుకుని ఇక్కడ స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. నిఘా వర్గాల పక్కా సమాచారంతో పోలీసులు ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ ఆపరేషన్‌లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా దళాలు పాల్గొన్నాయి. కర్రెగుట్టల నుంచి మొదలుకొని అబూజ్‌మడ్ పర్వతాలతోపాటు నేషనల్ పార్కులో అణువణువూ జల్లెడ పడుతుండటంతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పార్టీ దళపతి బస్వరాజ్ ఎదురుకాల్పుల్లో మృతిచెందగా.. నేషనల్ పార్కులో ఇప్పుడు అగ్ర కమాండర్లు మరణిస్తున్నారు. ఇదే ప్రాంతంలో భారత బలగాలకు మోస్ట్ వాంటెడ్ అయిన మావోయిస్టు నేత మడావి హిడ్మా కూడా ఉన్నట్లు సమాచారం. అతడి లక్ష్యంగానే ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

నగదు తల్లులకు అందిస్తాం" చంద్రబాబు తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ఏడాది పాలనపై ఈ నెల12న నియోజకవర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు చేయాలని నిర్ణయించారు. అదే రోజున సాయంత్రం ఎన్డీయే పక్షాలు, అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నారు. వచ్చే నాలుగేళ్లలో చేపట్టే కార్యక్రమాలపై ఇక్కడ చర్చించనున్నారు.

# 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ నుంచి 500 ఏఐ స్టార్టప్‌లు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యం నుంచి పరిశోధన, ఆవిష్కరణ వరకు ఏపీ పునాది వేస్తోందని చంద్రబాబు వివరించారు.

# ఏపీ సెక్రటేరియట్‌లో ..

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిన వెంటనే నిందితులు పరారయ్యారు.

**ఇలా పట్టుబడ్డారు..**

ముఠాలో కీలక నిందితుడైన సాయి వెంకట్ సుజిత్‌కు ఆరోగ్యం బాగోలేదని చూసేందుకు మిగతా నిందితులు సీహెచ్ మహేష్, రూబిన్ కుమార్, జాన్, యాకూబ్ విజయనగరం వస్తున్నట్లు పోలీసులకు సమాచారం వెళ్లింది. అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మాటువేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నేరం చేసినట్లు అంగీకరించారు. హైదరాబాద్‌లో నకిలీ ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తయారు చేసినట్లు విచారణలో తేలింది. పరారీలో ఉన్న మిగిలిన నిందితులనూ త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు సుజిత్ కోలుకోగానే అరెస్ట్ చేస్తామన్నారు. కేసు ఛేదించినందుకు సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# అప్పన్న దర్శనానికి పోటెత్తిన జనం

(మొదటి పేజీ తరువాయి)

ఆలయ ఉద్యోగులు వారికి కేటాయించిన విధులలో నిమగ్నమై భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి వెంద్ర త్రినాధరావు సూచనల మేరకు ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను నిర్వహించారు. వీరితో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి వి ఎస్ రామరాజు ఏఈఓ రమణమూర్తి పిల్లా శ్రీనివాసు తదితరులు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు.

# మూలపేట పోర్టు నిర్మాణ పనులు 50 శాతం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా సాగుతుండటం, మరోవైపు ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో ఉత్తరాంధ్ర వాసుల్లో ఆశలు నెలకొన్నాయి.

**తుది దశలో బెర్తులు**

270 మీటర్ల పొడవున.. 34 మీటర్ల వెడల్పుతో తూర్పు ముఖంగా మూడు జనరల్ బెర్తులు, పడమర ముఖంగా 300 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పుతో కోల్ బెర్తు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు బెర్తుల నిర్మాణం ప్రీకాస్ట్ స్లాబ్ విధానంలో పూర్తి చేసేందుకు పనుల వేగం పెంచారు. ఇందులో మొదటి బెర్తు ప్రీకాస్ట్ స్లాబ్ పనులు పూర్తయ్యాయి. బెర్త్‌ల వద్ద ఓడలు నిలిచేలా 15.85 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 8.49 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించారు. రోజుకు 50 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని మూడు డ్రెడ్జింగ్ యంత్రాలతో తవ్వుతున్నారు.

**చేపట్టాల్సిన పనులు**

పోర్టుకు అనుసంధానంగా వాహనాల రవాణాకు రహదారి, రైల్వే ట్రాక్ పనులు చేపట్టనున్నారు. జాతీయ రహదారి-16 టెక్కలి మండలం మోదుగవలస నుంచి నౌపడ మీదుగా మూలపేట పోర్టుకు 100 మీటర్ల వెడల్పుతో 13.8 కి.మీ. రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పోర్టు నుంచి నౌపడ, కూర్మనాథపురం, యామలపేట, పోతునాయుడుపేట, కోటపాడు భూముల్లో రైల్వే ట్రాక్ లైన్ నిర్మించాలి. ఈ పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. 12.6 మెగావాట్ల సామర్థ్యంతో టెక్కలి నుంచి 17 కి.మీ.మేర విద్యుత్తులైన్ల పనులు చేపట్టాలి. వంశధార నదిలో హిర మండలం జలాశయం నుంచి 0.5 ఎంఎల్‌డీల తాగునీటి సరఫరా పైపులైన్లను 50 కి.మీ.మేర నిర్మించాలి. పరిపాలన భవన పనులకు సంబంధించి రెండు అంతస్తులు, ఓడల ద్వారా వచ్చే సరకు నిల్వకు 4 భారీ గోదాముల నిర్మాణానికి డిజైన్లు సిద్ధం చేశారు. వీటి పనులు చేపట్టాల్సి ఉంది. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం నుంచి మూలపేట పోర్టు వరకు 7.8 కి.మీ. రైల్వే ట్రాక్ పనులు చేపట్టాల్సి ఉంది. 100 ఎకరాలకుగానూ 78.67 ఎకరాల భూసేకరణ పూర్తి చేశారు. పరిపాలనా భవనాలు, విద్యుత్తు ఉప కేంద్రాలు, క్యాంటీన్, గేట్ కాంప్లెక్స్, ఫైర్ స్టేషన్, కోల్ స్టాక్ యార్డు, పార్కింగ్ వసతి నిర్మాణాలు చేపట్టాలి. ఇందుకు మూలపేట, విష్ణుచక్రం గ్రామాలు తరలించాల్సి ఉంది. పునరావాస కాలనీకి సంబంధించి నౌపడ వద్ద 56 ఎకరాలు సేకరించారు.

# కన్నప్ప సినిమా విడుదలను అడ్డుకుంటాం

## పిలక, గిలక పాత్రలపై బ్రాహ్మణ చైతన్య వేదిక అభ్యంతరం




**గుంటూరు, విశాఖ సమాచారం:** మంచు విష్ణు కన్నప్ప సినిమా మరో వివాదంలో చిక్కుకున్నది. పిలక, గిలక పాత్రలపై బ్రాహ్మణ చైతన్య వేదిక అభ్యంతరం వ్యక్తం చేసింది. గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చైతన్య వేదిక సభ్యులు శివలింగానికి అభిషేకం చేశారు. సినిమాలో పిలక, గిలక పాత్రలు తీసేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. నిరసన అనంతరం సినిమా విడుదలను నిలిపివేయాలని హైకోర్టులో బ్రాహ్మణ చైతన్య వేదిక సభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. సినిమా విడుదలను అడ్డుకుంటామనీ ప్రకటించారు.

మరోవైపు ఇప్పటికే కన్నప్ప చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన దృశ్యాలు, డేటా ఉన్న హార్డ్ డ్రైవ్ మాయం అయినట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. మిస్ అయిన హార్డ్ డిస్క్‌లో సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ యాక్షన్ సీన్లు ఉన్నాయని హీరో మంచు విష్ణు తెలిపారు. సినిమాలో ప్రభాస్ దాదాపు 30 నిమిషాల పాటు కనిపించనున్నారని మంచు విష్ణు ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. ఇది జరిగిన కొన్ని రోజులకే చిత్రంపై బ్రహ్మణ సంఘాలు కోర్టుకు వెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది.

# ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ఫలితాలను ప్రకటించింది. ఈ పరీక్షలు మే 12 నుంచి మే 20, 2025 వరకు జరిగాయి. ఫస్ట్ ఇయర్ సప్లమెంటరీ పరీక్షలకు 1,35,826 మంది, సెకండ్ ఇయర్‌కు 97,963 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. కాగా ఈ రోజు విడుదల అయిన సప్లిమెంటరీ ఫలితాలను చెక్ చేసుకోవాలి అనుకునే విద్యార్థులు మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 అనే నంబర్‌కు వాట్సాప్ చేయడం ద్వారా పొందవచ్చు. లేదా https://resultsbie.ap.gov.in వెబ్ సైట్‌లో కూడా చెక్ చేసుకోవచ్చు.

# మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కన్నుమూత



(మొదటి పేజీ తరువాయి)

కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన శనివారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న రాజకీయ నాయ కులు, సన్నిహితులు, అభిమానులు సంతాపం ప్రకటిస్తున్నారు. పల్లా సింహాచలం 1983లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి వాసుదేవరావు ఈశ్వరపుపై ఓడిపోయారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి 1989లో జరిగిన ఎన్నికలలో పెందుర్తి శాసనసభనియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావు చేతిలో 19,903 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1994లో విశాఖపట్నం- 2 శాసనసభ నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన కాంగ్రెస్ అభ్యర్థి మరియదాస్ యంద్రపుపై 21773 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన 1999లో ఎన్నికలలో పోటీ చేయలేదు, ఆయన తిరిగి 2004లో విశాఖపట్నం-2 శాసనసభనియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సారిపల్లి రంగరాజు చేతిలో 51,010 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆయన కుమారుడు పల్లా శ్రీనివాసరావు రెండుసార్లు గాజువాక నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. రేపు ఉదయం 6 గంటలకు కొత్త గాజువాక ఎలిమెంటరీ స్కూల్ వద్ద ఉన్న తన స్వగృహం వద్ద నుండి అంత్యక్రియలు ప్రారంభం అగును.. కనుక గాజువాక పుర ప్రజలు పార్టీలకు అతీతంగా వారి ఆత్మ శాంతి చేకూరే విధంగా వారి అంతిమయాత్రలో పాల్గొనవలసినదిగా కోరుకుంటున్నాను.

**చంద్రబాబు, లోకేశ్, ఇతర ప్రముఖుల సంతాపం**



మాజీ శాసన సభ్యుడు పల్లా సింహాచలం మృతిపట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు. ఆయన మృతి పార్టీ కి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. అలాగే పలువురు పార్టీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రగాఢ సంతాపం తెలిపారు. పల్లా సింహాచలం ఎమ్మెల్యేగా విశాఖ ప్రజలకు ఎనలేని సేవలందించారు హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సంతాపం తెలిపిన వారిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు తదితరులు ఉన్నారు

# రాజంపేట టీడీపీ కీలక నేత సుగవాసి రాజీనామా



**రాజంపేట, విశాఖ సమాచారం:** అధికార టీడీపీకి బిగ్ షాక్ తగిలింది. ఈ పార్టీకి చెందిన కీలక నేత రాజీనామా చేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన టీడీపీ నేత సుగవాసి సుబ్రహ్మణ్యం రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను సీఎం చంద్రబాబుకు పంపారు. 2024 ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ కేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. గత కొంతకాలంగా రాజంపేట టీడీపీలో వర్గ విభేధాలు కొనసాగుతున్నాయి. దీంతో ఆయన పార్టీకి దూరంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అధికారం ఉన్నా సుబ్రహ్మణ్యం రాజీనామాతో ప్రస్తుతం రాజంపేట నియోజకవర్గంలో సంచలనంగా మారింది. అయితే రాజీనామా నిర్ణయం ఇప్పటిది కాదని లేఖలో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఐదారు నెలల నుంచే ప్రజాభిప్రాయాలు సేకరించానని తెలిపారు. ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లో కొనసాగుతానని సుబ్రహ్మణ్యం చెప్పారు.కాగా గత ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. రాజంపేట అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లనూ వైసీపీ కైవసం చేసుకుంది.

2nd pages1.qxd 6/7/2025 7:40 PM Page 3



## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వాలంటీర్ల సేవలు అవసరం

### అమెరికన్ కౌన్సిల్ జనరల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛంద సేవకులు (వలంటీర్ల) సేవలు అవసరమని హైదరాబాదులోని అమెరికన్ కౌన్సిలేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. శనివారం ఉదయం రిషికొండ బీచ్ వద్ద ఆంధ్ర విశ్వవిద్యాలయం అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా కౌన్సిల్ జనరల్ విద్యార్థులు వాలంటీర్లతో కలిసి సాగర తీర పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, వాలంటీర్లతో కలిసి బీచ్ లో ఉన్న వ్యర్థాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న వాలంటీర్లను, విద్యార్థులను, నగర పౌరులను ఆమె అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆమె అన్నారు.

ఏయు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు బీచ్ ను పరిశుభ్రంగా నిలపడానికి దోహదపడతాయని అన్నారు. వాలంటీర్లు ఉత్సాహంగా భాగస్వాములై ఈ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల వారిని అభినందించారు.

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ. ఎన్ ధనంజయ రావు మాట్లాడుతూ బీచ్ పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కమ్యూనిటీ డే కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా విభాగ సంచాలకులు ప్రొఫెసర్ ఎన్. విజయ్ మోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్. హరినాథ్, ఎన్సీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.ఎం. యుగంధర్, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాదు పబ్లిక్ డిప్లొమసీ అధికారిణి ఎమిలియా స్మిత్, అమెరికన్ స్పేసెస్ కోఆర్డినేటర్ మెలిస్సా నందుల, ఏయూ అమెరికన్ కార్నర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.అన్నారు.

## చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ ఆలయంలో వారాల పండగ!



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం జిల్లా మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు చంద్రంపాలెం గ్రామ పెద్దలు ముఖ్య సభ్యులు హాజరయి వారాల పండుగకు సంబంధించిన విషయాలు ఈ క్రింది విధంగా తెలియజేయడం జరిగింది,

విశాఖపట్నం,మధురవాడ, చంద్రంపాలెం జాతర గట్టుపై కొలువై ఉన్న పంచముఖ ఆంజనేయ, శ్రీ షిర్డీ సాయినాధ సహిత శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతీ సంవత్సరం వలే అమ్మవారి వారాల పండగ తేది 10/6/2025 విశ్వావసు నామ సంవత్సరం పౌర్ణమికి ముందు మంగళవారం (చతుర్దశి) రోజున ఘనంగా జరుపబడును,

**కార్యక్రమాలు**

తేది10/6/24 మంగళవారం ఉదయం 7:30 గంటలకు శ్రీదుర్గాలమ్మ అమ్మవారికి పంచామృత సుగంధ జలాలతో అభిషేకం,, అలంకరణ, కుంకుమార్చనలు, పుష్పార్చనలు నీరాజన మంత్ర పుష్పం , తీర్ధ ప్రసాదాలు వితరణ.

అదే రోజు మధ్యాహ్నం 3:00 గంటలకు ముందుగా శ్రీబంగారమ్మ అమ్మవారి అనుపు సంబరం మేళ తాళాలు, మహిళా కోలాటం, బేతాళ డాన్సులు, మహిళల తీన్ మార్, కర్రసాము మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలతో చంద్రంపాలెం అన్ని తిరుగుతూ శ్రీ బంగారమ్మ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని మొక్కులు చెల్లించడం.

తదుపరి సాయంత్రం 4:00 గంటలకు శ్రీదుర్గాలమ్మ అమ్మవారి అనుపు సంబరం మేళ తాళాలు మహిళా కోలాటం, బేతాళ డాన్సులు మహిళల తీన్ మార్, కర్రసాము మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలతో చంద్రంపాలెం గ్రామంలో అన్ని వీధులు తిరుగుతూ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని మొక్కులు చెల్లించడం జరుగుతుందని, అమ్మవారి వారాల పండగలో భక్తులు యావన్మంది పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు,

ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, జాయింట్ సెక్రటరీ పిళ్లా మోహన్ శివకృష్ణ, ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, సభ్యులు బోగవిల్లి రాము, పోతిన రాంబాబు తదితరులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు.

## పల్లా సింహాచలానికి గంటా నివాళి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** కార్మిక నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం విశాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రాజేంద్రనగర్ లోని నివాసంలో సింహాచలం భౌతిక కాయానికి శనివారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పల్లా సింహాచలం మరణం టీడీపీకి, విశాఖ ప్రజలకు తీరని లోటని ఆయన పేర్కొన్నారు. టీ.ఎన్.టి.యు.సి. నాయకుడిగా పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల పక్షాన చేసిన పోరాటాలను ప్రజలు మరచిపోలేరన్నారు. సింహాచలం కుమారుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు గంటా తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## జిల్లా అభివృద్ధికి మహిళా పారిశ్రామికవేత్తలే కీలకం

### గ్రోత్ సెంటర్ లో సుధీర్ పాలిమర్స్ ని ప్రారంభించిన కలెక్టర్ అంబెడ్కర్, ఎమ్మెల్యే బేబినాయనా



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** జిల్లా అభివృద్ధి చెందాలంటే చదుకున్న మహిళా పారిశ్రామికవేత్తలు కొత్త పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ అన్నారు. శనివారం బొబ్బిలి గ్రోత్ సెంటర్లో సుధీర్ పాలిమర్స్ పరిశ్రమను ఆయన ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర లో కొత్త తరహాలో పి.ఎమ్. ఈ.జి.పి పథకం ద్వారా ప్లాస్టిక్ గ్రాన్యూల్ పరిశ్రమను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని 2024,25 సంవత్సరంలో ఉత్తరాంధ్ర లోనే ఇది మొదటి పరిశ్రమ అని రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం తో ఉత్సాహంగా ఉండే యువతను ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్ సెంటర్లో కొత్త తరహా ప్లాస్టిక్ పరిశ్రమ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే జిల్లా అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు ఈ ప్రారంభోత్సవం లో డి.ఆర్.డి.ఏ.పీడీ కళ్యాణ చక్రవర్తి, లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, పరిశ్రమ నిర్వహకురాలు ఆళ్ల జ్యోతి,శిరీష,ల తో పాటుగా ఆర్డీవో బొబ్బిలి, మండల తహశీల్దార్ వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## కాకినాడలో 7 వేల మందితో పెద్ద ఎత్తున యోగ

### ఉత్సాహంగా యోగ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, యువత, మహిళలు విద్యార్థులు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):-** ప్రతి ఒక్కరూ దయనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలని జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగలి అన్నారు. జిల్లా అంతట యోగాంధ్రాకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చని జిల్లా కలెక్టర్ సన్మోహన్ పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక యోగా కార్యక్రమం శనివారం కాకినాడ మెయిన్ రోడ్డు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఎల్ఐసి బిల్డింగ్ సెంటర్ వరకు నిర్వహించారు. యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సన్మోహన్, ఎమ్మెల్సీలు పేరా బత్తుల రాజ శేఖరం, కర్రీ పద్మశ్రీ, కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మాలిష్ పాటిల్, దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి జి వెంకటరావు, పాడాపిడి చైత్ర వర్షిని, కాకినాడ ఆర్డిఓ మల్లి బాబు లతోపాటు ఇతర శాఖల అధికారులు, 7 వేల మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై యోగాసనాలు సాధన చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత మే నెల 21 నుండి ఈనెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నామన్నారు. జూన్ 21 విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవానికి సంబంధించి ఇప్పటివరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో శనివారం ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా సుమారు 7 వేలమంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ యోగా సాధన కేవలం అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజు వరకు మాత్రమే పరిమితం కాకుండా నిత్య జీవితాలలో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగాను రోజు సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత తో పాటు వివిధ వృత్తులలో పనిచేస్తున్న వారు మరింత సమర్థతతో విధులు నిర్వహించేందుకు యోగ దోహదపడుతుందని ఆయన తెలిపారు.

జిల్లా అంతట ఈ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. జూన్ 21న జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో యోగ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈరోజు జరిగిన యోగా కార్యక్రమం విజయవంతముగా నిర్వహించడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారి యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా అధికార యంత్రాంగానికి పూర్తి సహకారాన్ని అందించాలని కలెక్టర్ సన్మోహన్ కోరారు. అనంతరం ఎమ్మెల్యే వనమాడి, మనిషి పేరా బత్తుల, ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షకులు రామానంద అందరి చేత ఆసనాలు సాధన చేయించారు ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్య అధికారి అలీ తో ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెత్తకు మంట పెట్టిన ఆకతాయిలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** 49 వ వార్డు ఎన్జీవోస్ కాలనీ కొండవాలు ప్రాంతంలో చెత్తకు మంట పెట్టిన ఆకతాయిలు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసి చెట్లతో కూడిన కొండకు వ్యాప్తి చెందకుండా నిరోధించారు ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇక్కడ ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని పోలీసు వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సందర్భంగా ఎడిఎఫ్ఓ మాట్లాడుతూ స్థానికులు ఇక్కడ చెత్తా చెదారం వేయరాదని ఇలా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల ఇటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని హితవు పలికారు ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఏడిఎఫ్ఓ కేవిటి ప్రసాద్ ఎల్ ఎఫ్ ఆర్ చిన్న ఎల్ ఎఫ్ డి అర్జున్ డి ఓ పి సిహెచ్ రమేష్ బాబు ఫైర్ మాన్ గజపతి తిరుమల ప్రసాద్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లు ఆమోదించడం సరికాదు



**బొబ్బిలి, (విశాఖ సమాచారమ్):-** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం సరికాదని సీఐటీయూ నాయ కులు పేర్కొన్నారు.ఈ మేరకు శుక్రవారం బొబ్బిలి కోరాడవీధి జంక్షన్లో సీఐ టీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసనతెలిపారు.ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం ఎని మిది నుంచి 12 గంటల పనివిధానానికి తెరలేపడం దుర్మార్గ చర్యఅని తెలిపారు. కార్మికుల రక్తమాంసాలను పీల్చి పిప్పిచేస్తున్న వర్గానికి ఇది మరింత ఊతమిస్తోందన్నారు. టెక్నాలజీ నెపంతో ఇప్పటికే మానవశ్రమను తగ్గిస్తున్నారని, దీనికి తోడుగా పనిగంటలను పెంచడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. నిరుద్యోగాన్ని పెంచడానికి, కొనుగోలు శక్తి నశించడానికి ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలు దోహదం చేస్తాయని తెలిపారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో గౌరీశ్, రామారావు, యుగంధర్, వెంకటి పాల్గొన్నారు.

## విఎంఆర్డిఎ ఆధ్వర్యంలో యోగాంధ్ర

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వి ఎం ఆర్ డి ఎ ఆధ్వర్యంలో ఈ నెల 9 న యోగాసనాల కార్యక్రమం యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ గారు, మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ విశ్వనాధన్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు బీచ్ రోడ్ వుడా పార్క్ వెనుక ఉన్న ఎం జి ఎం పార్క్ లాన్ లో జరిగే ఈ యోగాసనాల కార్యక్రమం లో నగర ప్రజలు అందరూ పాల్గొనాలని కోరారు. ప్రవేశం ఉచితమని, ముఖ్యంగా యోగా సంస్థలకు చెందిన గురువులు, యోగ అభ్యాసకులు పాల్గొనాలని కోరారు. పాల్గొనే వారు సోమవారం ఉదయం 6.30 గంటలకు ఎం జి ఎం పార్క్ కి చేరుకోవాలని కోరారు.

## ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కందాళ సుబ్రహ్మణ్య తిలక్



### నేడు వర్ధంతి

కందాళ సుబ్రహ్మణ్య తిలక్, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. ఈయన స్వాతంత్ర్య కోసం తనదైన శైలిలో పోరాడుతున్న గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. క్షణం కూడా ఆలోచించకుండా గాంధీ బాటన నడిచేందుకు ఉద్యుక్తుడయ్యాడు. స్వాతంత్ర్యోద్యమంలో విజయనగరం జిల్లా నుంచి కీలక పాత్రధారయ్యారు.

కందాళ సుబ్రహ్మణ్య తిలక్ విశాఖపట్నం జిల్లాలో జూలై 15 1920 న విశాఖపట్నంలో అల్లిపురంలో శేషశాయి, రాజరాజేశ్వరి దంపతులకు జన్మించారు. దురదృష్టవశాత్తు పుట్టిన 5 రోజులకే మాతృవియోగం కలిగినందతనికి. తిలక్ ప్రాథమిక విద్య విజయనగరం దాసన్నపేట పూసపాటి ఆనందగజపతి మెమోరియల్ మునిసిపల్ హైస్కూల్లో జరిగింది. విజయనగరం మహారాజా కాలేజీలో ఇంటర్మీడియట్ (ఎఫ్.ఎ) పూర్తిచేసారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో బి.ఎస్సీ అభ్యసించారు. అక్కడ వీరు విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించారు. 1943 నుండి 1945 వరకు కర్ణాటకలోని బెల్గాంలో గల లక్ష్మాగౌడా న్యాయకళాశాలలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. వీరి వివాహం 1941 ఫిబ్రవరి 7న సూర్యకాంతం తో జరిగింది. ఈ దంపతులకు ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలు. ఈయన శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం చేయించినప్పుడు ఏడుగురు తాతగార్లు ఉపనయనం చేసిన సందర్భంలో వేసిన యజ్ఞోపవేతాన్ని జాతీయ ఉద్యమంలో అడుగుపెట్టినప్పుడు త్యజించారు. అన్నింటా ఆదర్శవంతంగా నిలచిన సూర్యాకాంతం గారు కూడా 1949లో తనకు వివాహ సమయం లో భర్త కట్టిన మంగళసూత్రాన్ని త్యజించారు. జాతీయోద్యమ సమయంలో ఈయన ఇంటికి వచ్చిన అందరినీ సమానంగా కులమతాలకు అతీతంగా ఆదరించి భోజనం పెట్టేవారు.

తిలక్ 1975లో విజయనగరంలో సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్ అనే సంస్థను స్థాపించారు. 1981 నుండి 1982 వరకు ఒయాసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీకి సేవలందించారు. 1982 నుండి 1984 వరకు యలమంచిలిలో గల భాగవతుల ట్రస్టుకు సేవలందించారు. తమ కుమారుడికి కులాంతర వివాహం చేసారు. వరకట్న వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. 1997లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆయనకు కళాప్రపూర్ణ ను ఇచ్చి గౌరవించింది . ఆయనకు 80 సం. వయస్సు వచ్చిన నేపథ్యంలో విశాఖ సముద్రతీరంలో గల విశ్రాంత అనే వృద్ధాశ్రమంలో చేరారు. 2012 మే 13వ తేదీన లోక్‌సభకు జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతులమీదుగా తిలక్‌ను ఘనంగా సత్కరించారు.2105 మే27న ఆయనకు భార్యా వియోగం కలిగింది. 2015 లో విశాఖపట్నం లో జరిగిన స్వాతంత్ర వేడుకల్లో భాగంగా నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తిలక్‌ను సత్కరించారు. ఆంధ్ర తిలకంగా పేరుగాంచిన తిలక్ గారు 2018 జూన్ 8వ తేదీన మరణించారు. వీరి కుమారుడు కందాళ అశోక్ వ్యవస్థాపకులుగా కె.ఎస్. తిలక్ ఫౌండేషన్ ట్రస్ట్ ను స్థాపించి ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నారు.

అప్పట్లో బ్రిటిష్ వారి చిత్రహింసలకు గురవుతున్న ప్రజలను చూసి అతను చలించిపోయారు. తెల్ల దొరల ఆగడాల నుంచి భారత ప్రజలను విముక్తి చేయాలనే ఆలోచన అతనికి కలిగింది. అదే సమయంలో స్వాతంత్రం కోసం పోరాడుతున్న గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, విద్యాభ్యాసం చేస్తుండగానే ఉద్యమంలోకి దిగారు. 1942 ఆగస్టు 9 న చేపట్టిన పికెట్‌తో తిలక్ ఉద్యమంలోకి ప్రవేశించాడు. ఈ పికెట్‌లో ఉత్తరాంధ్రకు చెందిన 14 మంది పాల్గొన్నారు. వారితో కలిసి చాలా ఉద్యమాల్లో తిలక్ భాగస్వామి అయ్యాడు.

కందాళ సుబ్రహ్మణ్య తిలక్ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా రెండు సార్లు జైలు జీవితం గడిపారు. ఈ రెండు విడతల్లో దాదాపు 130 రోజులు జైలులోనే గడిపారు.1942లో పికెటింగ్ చేపడుతున్న సమయంలో తిలక్‌ను ఆంగ్లేయులు అరెస్టు చేశారు. విజయనగరం సబ్ జైలులో కొంత కాలం ఉంచారు. ఆ తర్వాత 1943 జనవరి 26 న విజయనగరంలోని ప్రకాశం పార్కులో జాతీయ జెండా ఎగుర వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కార్యక్రమ నిర్వహణకు ఉద్యుక్తులవుతున్న సమయంలో ఆంగ్లేయ అధికారులు వచ్చి అందరినీ పట్టుకుపోయారు. వీరిలో తిలక్ కూడా ఉన్నారు. అప్పట్లో కేరళ రాష్ట్రం బళ్లారి ఎయిర్‌పోర్ట్ జైలుకు తరలించారు. ఈ జైలులో తిలక్ నాలుగు నెలలు గడిపారు. జైలు జీవితం ఎలా గడిచిందంటే....

జైలులో దాదాపు 130 రోజులు గడిపిన తిలక్ అనేక ఇబ్బందులకు గురయ్యారు. జైలులో జెండా ఊంఛా రహే హమారా... బోలో స్వతంత్ర భారత్‌కి జై... అనే నినాదాలను ఉద్యమకారులు చేసేవారు. దీనికి ఆంగ్లేయ అధికారులు కోపోద్రోక్తులై లాఠీలు విరిగేలా చితకబాదేవారు. అలాగే వీరికి సరైన భోజనం ఆంగ్లేయ అధికారులు అందించేవారు కాదు. ఉదయాన నూకల జావ, మధ్యాహ్నం 14 గ్రాములు మాత్రమే అన్నం, మట్టి కుండల్లో వేసిన పిక్క చారును భోజనంగా ఇచ్చేవారు. అయినప్పటికీ స్వాతంత్ర్యోద్యమంలో లీనమైన ఉద్యమకారులు లాఠీ దెబ్బలను లెక్క చేయలేదు. అలాగే వారు ఏ భోజనం పెట్టినా ఆనందంగా భుజించేవారు. ఈ విధంగా తెల్ల దొరల చిత్ర హింసలను తట్టుకుంటూనే ఎంతో ఓపికతో తిలక్ జైలు జీవితం గడిపారు. కాగా, తిలక్‌ను అరెస్టు చేసిన సమయంలో భార్య సూర్య శేషుకాంతం తనను కూడా అరెస్టు చేసి భర్తతో తీసువెళ్లాలని పట్టుబట్టారు.

కందాళ సుబ్రహ్మణ్య తిలక్ ఎన్నో పోరాటాల ద్వారా స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా 1952లో జరిగిన ఎన్నికల్లో పోటీ రంగంలో దిగారు. పూసపాటి విజయరామ గజపతిరాజు, ప్రముఖ స్వాతంత్రోద్యమ నాయకుడు జయప్రకాష్ నారాయణ ప్రోద్బలంతో తిలక్ ఇచ్ఛాపురం పాయకరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేశారు. పోటీ బరిలో నలుగురు నిలిచారు. బివి సంజీవరావు, పసుమర్తి వీరభద్రరావు, కాళ్లకూరి కృష్ణమూర్తి, తిలక్ మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో లక్షా 87 వేల ఓట్ల ఆధిక్యతతో తిలక్ విజయం సాధించి ఎంపిగా ఎన్నికయ్యారు. అప్పట్లో మహాత్మా గాంధీ ఎప్పటికప్పుడు తిలక్‌కు ఉత్తరాలు రాసేవారు.

1944 నుండి 1945 వరకు లాకాలేజి స్టూడెంట్స్ యూనియన్ కు సెక్రటరీగా ఎన్నికయ్యారు. 1945లో బొంబాయిలో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలా పాల్గొన్నారు. 1945-46లో విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంయుక్త కార్యదర్శిగా పనిచేసారు. 1947లో సోషలిస్ట్ పార్టీలో చేరారు. 1947 నుండి 1952 వరకు విజయనగరం జిల్లా, రాష్ట్ర సోషలిస్ట్ పార్టీ కార్యదర్శి గా సేవలందించారు. వీరు 2018 జూన్ 8 న మరణించారు.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108.**

2nd pages1.qxd 6/7/2025 7:40 PM Page 4



విశాఖ సమాచారమ్

ఆదివారం 8-6-2025

# యుద్ధాలతో పర్యావరణ విలాపం

యుద్ధం కొనసాగినన్ని రోజులూ రణ క్షేత్రాల్లో ఎక్కడ చూసినా రక్తతర్పణమే. సైనికుల రుధిరంతో తడిసి ముద్దయిన భూములు మాత్రమే కాదు పరోక్షంగా కోట్లాది ఎకరాల్లో సాగుభూమి, జనావాస ప్రాంతాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ), 2024 నివేదిక స్పష్టంచేసింది. హౌతీల తిరుగుబాటు, హమాస్ - ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్ - రష్యా యుద్ధంతోపాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాలు, ఘర్షణలు చివరకు పర్యావరణ సంక్షోభాగ్నుల్ని మరింత ఎగసిపడేలా చేస్తున్నాయని యూఎన్ఈపీ నివేదిక వెల్లడిరచింది. సరిహద్దు వివాదాలు మొదలు అంతర్జాతీయ విధానాలదాకా పొరుగు దేశాలు, శత్రుదేశాల మధ్య వైరం తుదకు పర్యావరణాన్ని మరింతగా నాశనంచేస్తోందని నివేదిక హెచ్చరిస్తోంది. దశాబ్దాల క్రితమే జీవాయుధాలు ప్రయోగించి కిలోమీటర్ల కొద్దీ జనావాసాలను విషవాయువులతో గరళమయం చేసిన దేశాల దుష్టాంతాలనూ నివేదిక గుర్తుచేసింది. యుద్ధాల వేళ శత్రు దేశాల జలాశయాలను, ఆనకట్టలపై బాంబులేసి నేలమట్టంచేయడంతో వందల కోట్ల లీటర్ల తాగు,సాగునీరు దిగువ ప్రాంతాలను ముంచేసి లక్షల ఎకరాల సాగుభూములు నీటమునుగుతున్నాయి. ఆనకట్టల నీరు సమీప ప్రాంతాల్లో గనుల తవ్వకాన్ని స్తంభింపజేస్తోంది. ఆయా నదీ ప్రవాహాల వెంట జీవవైవిధ్యం సైతం ధ్వంసమవుతోంది. మైదాన ప్రాంతాలు, పీఠభూములు సైతం నామరూపాల్లేకుండా నాశనమవుతున్నాయి. ఇలా ఆయా దేశాల్లో పర్యావరణం పతనమవుతోంది.

1990 దశకం నుంచి చూస్తే ఇప్పటిదాకా ఎన్నో యుద్ధాలు మరెన్నో రకాలుగా పర్యావరణ విధ్వంసానికి ప్రధాన కారణమయ్యాయి. 1990 దశకంలో యుద్ధంలో భాగంగా కువైట్‌లోని 700కుపైగా చమురు బావులకు ఇరాక్ సేనలు నిప్పు పెట్టాయి. దీంతో రోజుకు 50 లక్షల బ్యారెళ్ల చమురు అగ్నికి ఆహుత్కె నల్లటి మేఘాలు యావత్ ప్రాంతంలో కమ్మేశాయి. దీంతో అంతులేని పర్యావరణ విధ్వంసం జరిగింది. చమురుబావులు ఏకధాటిగా ఏడు నెలలపాటు తగలబడి చరిత్రలో ఎన్నడూ లేనంతటి పొగను సహజావరణలోకి వెదజల్లాయి. సమీప సముద్ర ఉపరితలజలాలు సైతం విస్తృతంగా పరుచుకున్న చమురు తెట్టతో పాడైపోయాయి. దీంతో పర్యావరణ సమతుల్యత బాగా దెబ్బతింది. కువైట్ లోని 99 శాతం మంచినీటి సరస్సులు కాలుష్యకాసారాలుగా మిగిలిపోయాయి. వాయుకాలుష్యానికితోడు ఆ రీజియన్‌లో మెజారిటీ ప్రజలకు శ్వాససంబంధ వ్యాధులు ప్రబలాయి. ఈ ఘటనతో ప్రపంచం ఆర్థికగాయాలను చవిచూడాల్సి వచ్చింది. ఆతర్వాతి నుంచే ముడి చమురు ధరలు వడివడిగా పెరగడం మొదల్కెంది.

ఉక్రెయిన్‌పైకి దురాక్రమణ జెండాతో దూసుకొస్తున్న రష్యా వైమానిక దళాలు 2023లో కఖోవ్కా ఆనకట్టను రాత్రికిరాత్రే పేల్చేశారు. దీంతో డ్యామ్‌లోని అపార జలరాశి దిగువ ప్రాంతాల్లోకి వృథాగా పోయింది. దిగువ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. 5 లక్షల ఎకరాల్లో పంటభూములు పూర్తిగా నాశనమయ్యాయి. గనులు, చమురు బావులు, పారిశ్రామిక వ్యర్థాలు మొత్తం డినిప్రో నది, నల్లసముద్ర పరీవాహక ప్రాంతాల్లోకి కొట్టుకొచ్చి పర్యావరణ విధ్వంసాన్ని మరింత పెంచాయి. ఇలా ఒక్క కఖోవ్కా డ్యామ్ పేల్చివేతతో దాదాపు వేయికిపైగా ప్రాంతాల్లో పర్యావరణం కోలుకోనంతగా పాడైపోయిందని నివేదిక పేర్కొంది. జీవవైవిధ్యం ధ్వంసమవడంతోపాటు వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

గాజాలో ఇజ్రాయెల్ విధ్వంసం ఇంకా కొనసాగుతోంది. భవనాలు, రోడ్లను పేల్చేయడంతో గాజా అంతటా ఎక్కడ చూసినా కాంక్రీట్ శిథిలాల కుప్పలే కనిపిస్తున్నాయి. 2023 - 24 కాలంలో గాజాలో దాదాపు 4 కోట్ల టన్నుల చెత్త పెరిగింది. అంటే ప్రతి చదరపు మీటర్‌కు 107 కేజీల చెత్త అదనంగా వచ్చి చేరింది. గాజాలో పచ్చదనం దాదాపు పూర్తిగా కనుమరుగైంది. గాజా సమీప ప్రాంతాల్లో 80% చెట్లు కూలిపోయాయి. మూడిరట రెండొంతుల సాగుభూమి బాంబులు, ఫిరంగి గుళ్లు, క్షిపణి శకలాలతో నిండిపోయి సాగుకు పనికిరాకుండా పోయాయి. తూర్పు మధ్యదరా ప్రాంతంలో భూమాత ఊపిరితిత్తులుగా ఖ్యాతిగాంచిన 'వాడీ గాజా' చిత్తడి నేలలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. ఇక్కడి 150 రకాల సకశేరుక జీవులు, 70 రకాల ప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రోజూ ప్రపంచవ్యాప్తంగా వందల పౌరవిమానాలు కోట్ల లీటర్ల ఇంధనాన్ని మార్గమధ్యంలో ఆకాశంలో మండిస్తూ పొగను వెదజల్లుతూ పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. సముద్రమార్గాల్లో ప్రయాణిస్తూ సరుకు రవాణా నౌకలు సైతం ఇదే పనిచేస్తున్నాయి. వీటిని మించి యుద్ధాల ద్వారా దేశాల సాయుధబలగాలు అత్యధికస్థాయిలో కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల విడుదలలో యుద్ధాల్లో పాల్గొన్న దేశాల మిలటరీల వాటా 5.5 శాతానికి పెరిగింది.

ఇందులో ఒక్క అమెరికా వాటానే ఒక శాతం ఉండటం గమనార్హం. యుద్ధ ట్యాంక్‌లు, శతఘ్నులు, జెట్ విమానాలు, సైనిక రవాణా వాహనాలు కోట్ల లీటర్ల ఇంధనాన్ని తాగేస్తూ పొగ, అత్యధిక స్థాయిలో కర్బన ఉద్గారాలను వెలువరిస్తున్నాయి. గాజాలో పేలుళ్లతో పేరుకుపోయిన 1.5 కోట్ల టన్నుల కాంక్రీట్ శిథిలాలు సైతం పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించనున్నాయి. సహజ వనరులు నాశనం కావడానికి కొత్తగా పొడచూపుతున్న యుద్ధాలు 40 శాతం కారణమని నివేదిక పేర్కొంది. ఇకన్కెనా పర్యావరణ విధ్వంసాలకు ఆయా దేశాలను బాధ్యులను చేస్తూ నష్టపరిహార, సహాయక చర్యలు తీసుకోవాలని యున్కెటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ సూచించింది.

## పంచాంగం

ఆదివారం 8-6-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాయణం, గ్రీష్మ రుతువు
జ్యేష్ఠ మాసం

తిథి : శు. ద్వాదశి ఉ. 7.18
నక్షత్రం : స్వాతి ప. 12.42
వర్జ్యం : సా. 6.57 ల 8.44

# ఔను.. మీరూ రచయిత కావచ్చు!






అనుకున్నవి రాసుకుని పోస్ట్ చేసుకోవడానికి సామాజిక మాధ్యమాలు ఉండగా "కథల ఫ్యాక్టరీ" శీర్షికతో మీరూ రచయిత కావచ్చు అనే పుస్తకంతో పనేముందని అనుకోవచ్చు. కానీ ఈ పుస్తకం అఆలు దిద్దుకుంటున్న రచయితలకు ఇది అవసరమే. ఏది పడితే అది రాయొచ్చు. కాదనడం లేదు. కానీ రాసేవి నిర్మాణాత్మకంగా అర్థవంతంగా ఉండాలి కదా. అప్పుడే పాఠకుల హృదయంలో సుస్థిర స్థానం దక్కించుకోగలం. శైలిని మెరుగుపరచుకుంటూ చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పడం ఎలా? అని తెలుసుకోవడానికి రచయిత గోవిందరాజు చక్రధర్ సరికొత్తగా పాఠకలోకానికి అందించిన "కథల ఫ్యాక్టరీ" పుస్తకం ఎంతగానో దోహదపడుతుంది.

సీనియర్ జర్నలిస్టుగాను, ప్రచురణ కర్తగాను, జర్నలిజం పాఠాలు బోధించడంలో విశేషం అనుభవమున్న చక్రధర్ రాసిన ఈ పుస్తకంలో మొత్తం అర డజన్ ప్రధాన విభాగాలు ఉన్నాయి. అవి, ది బిగినింగ్, రూట్ మ్యాప్, హార్ట్‌బీట్, సెంట్రల్ పాయింట్, రోల్ ప్లే, నేరేషన్. ఈ ఆరు భాగాల్లోని 24 అధ్యాయాల్లో ఆయన పేర్కొన్న విషయాలన్నీ ముఖ్యమైనవే. రచయిత కావాలన్న ఆకాంక్ష ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని రూపు దిద్దిన పుస్తకమిది. ఆయా సందర్భాలలో చక్రధర్ గారు కొందరి రచనల నుంచి కొన్ని ఉదాహరణలు తీసుకున్నారు.

**ఆత్మకథ రాసుకుంటారా?**

ఊరి జ్ఞాపకాలను నెమరేస్తారా? యాత్రల కబుర్లను కలబోస్తారా? కవితా వీధిలో విహరిస్తారా?

కథకుడిగా కదం తొక్కుతారా? నవనవోన్మేషంగా నవలల్ని పంపిస్తారా?

వ్యాసపీఠంపై మఠం వేసుకుని కూర్చుంటారా?

సినిమా స్క్రిప్టుపై దృష్టి సారిస్తారా? వంటి ప్రశ్నలను సంధిస్తూ రచయిత కావాలన్న కోరికను నిజం చేయడానికి సందర్భోచితంగా కొన్ని సంఘటనలను ప్రస్తావిస్తూ ఆద్యంతమూ ఆసక్తితో చదివించేలా చేశారు రచయిత.

శీర్షికలు వేటికవే "క్యాచీ"గా ఉండి పాఠకుడిని కట్టిపడేస్తాయనడం అతిశయోక్తి కాదు.

సమకాల తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసిన రచయిత శిరంశెట్టి కాంతారావు గారు తన దృష్టికి ఏవైనా సంఘటనలు వచ్చినపుడు దూరాభారాన్ని లెక్క చేయకుండా క్షేత్రస్థాయికి వెళ్ళి విషయం సేకరించి రాసిన ఉదంతాన్ని పాఠకుల ముందుంచడం బాగుంది. అందువల్లే ఆయన రచనలు పాఠకాదరణ పొందడమే కాకుండా ఆలోచించేలా చేశాయి.

ఒక ఐడియా కథనే మార్చేస్తుంది అనే అధ్యాయంలో రచయిత ఓ స్వానుభవాన్ని పంచుకుంటూ రోడ్డు పక్కన కనిపించిన పిల్లవాడి షూ గురించి చేసిన ఆలోచనలు, డస్టర్ - చాక్ పీస్ ల అనుబంధం, ఓ పెద్దాయన కుక్కలకు ప్రతి రోజూ ఆహారంగా పెట్టిన బ్రెడ్డు కథనం చదువుతుంటే దేన్నయినాసరే ఆలోచించగలిగితే చక్కగా చిక్కగా పట్టుగా రాయవచ్చనే ఆసక్తి పుట్టడం తథ్యం.

టేకాఫ్, ల్యాండింగ్ - రెండూ ముఖ్యమే అధ్యాయంలో సంజీవ్ దేవ్ తన రచనల్లోని ప్రారంభాలు, ముగింపుల గురించి వెల్లడించిన అభిప్రాయలను ఇవ్వడం బాగుంది.

అలాగే వాక్యాల సొగసు చదవ తరమా అధ్యాయంలో పదచిత్రం కారుడు పోతనామాత్యుడు, ముళ్ళపూడి వెంకటరమణ, సత్యం శంకరమంచి, రావిశాస్త్రి గొల్లపూడి మారుతీరావు వంటి ప్రముఖ రచయితల శైలిని పొందుపరచడం రచయితలుగా ఎదగాలనే వారికి ఓ పాఠమే. వారి రచనలు చదువుతుంటే ఎవరికైనా రాయాలనే కోరిక పుట్టడం ఖాయం.

చదివితే ఇంకేం రాయగలం అని అనుకుంటే పొరపాటు. ఎంత ఎక్కువ చదివితే అంత ఎక్కువగా రాయగలం అనేది నిజం. పాఠకుల మనసులో సుస్థిర స్థానం సంపాదించగలం అని నా అభిప్రాయం. ఆ కోణంలో నుంచి కూడా "కథల ఫ్యాక్టరీ" పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

160 పేజీల ఈ పుస్తకంలో అక్షరాల ఫాంట్ సైజు, లైనుకీ లైనుకీ మధ్య ఇచ్చిన స్పేసు వల్ల ఏ వయస్సు వారికైనా చదవడానికి హాయిగా ఉంటుంది.

ఇక ముఖచిత్రం చూడ ముచ్చటగా హరివిల్లే ఉంది.

మరొక్క విషయం - ఈ పుస్తకం పుట్టుకలో టైపింగ్ పరంగా నాకూ కొంత పాత్ర కల్పించిన రచయిత చక్రధర్ గారికి కృతజ్ఞతలు.

"కథల ఫ్యాక్టరీ" పుస్తకావిష్కరణ కార్యక్రమం జూన్ నాలుగో తేదీన ఎమెస్కో పబ్లికేషన్ (గగన్ మహల్, హైదరాబాద్) కార్యాలయంలో జరిగింది. ఎమెస్కో అధినేత విజయకుమార్ గారు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డి. చంద్రశేఖర రెడ్డి (ఎమెస్కో), వల్లీశ్వర్ గారు, రచనా జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు గారు, ప్రొఫెసర్ జి. వెంకటరాజంగారు, పి. లక్ష్మణరావుగారు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మీడియా హౌస్ పబ్లికేషన్స్ నుంచి తాజాగా వెలువడిన ఈ పుస్తకం కావలసిన వారు గోవిందరాజు చక్రధర్ గారి ఫోన్ నెంబరు 98498 70250కి కాల్ చేసి పొందవచ్చు. పుస్తకం ధర రూ. 200/-.

**- యామిజాల జగదీశ్**

# ఛాలెంజ్ చేసి మరీ 100 సినిమాలకు డైరెక్ట్ చేసిన ఘనాపాటి

## (నేడు కె.ఎస్.ఆర్.దాస్ వర్థంతి సందర్భంగా..)






కె.ఎస్.ఆర్.దాస్.. తెలుగు సినిమాను పౌరాణిక, జానపద, కుటుంబ కథా చిత్రాల నుంచి క్రైమ్ అండ్ యాక్షన్ వైపు పరుగులు తీయించిన దర్శకుడు. తెలుగు సినిమా చరిత్రలో ఈ పంథాలో సినిమాలు తీసి మెప్పించిన దర్శకుడు మరొకరు లేరు అంటే అతిశయోక్తి కాదు. ఆరోజుల్లో యాక్షన్ సినిమా అంటే కె.ఎస్.ఆర్.దాసే చెయ్యాలి. అంతలా ప్రేక్షకుల్నే కాదు, ఇండస్ట్రీలోని ప్రముఖుల్ని కూడా మెస్మరైజ్ చేశారు. అల్లూరి సీతారామరాజు వంటి చారిత్రాత్మక చిత్రంలోని పోరాట సన్నివేశాలను చిత్రీకరించే బాధ్యత కె.ఎస్.ఆర్.దాస్‌కి అప్పగించారంటే యాక్షన్ సీక్వెన్స్‌లపై ఆయనకు ఉన్న పట్టు ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇండియాలోనే తొలి కౌబాయ్ మూవీ మోసగాళ్ళకు మోసగాడుని తెరకెక్కించిన ఘనత ఆయనది. తెలుగు సినిమాకి ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చిన దర్శకుడు దాస్ .

1936 జనవరి 5న నెల్లూరు జిల్లా వెంకటగిరి లో చెంచురామయ్య, శేషమ్మ దంపతులకు జన్మించారు కె.ఎస్.ఆర్.దాస్. ఆయన పూర్తి పేరు కొండా సుబ్బరామదాస్. హైస్కూల్ చదువు పూర్తయిన తర్వాత గుంటూరులోని కృష్ణ మహల్ థియేటర్‌లో బుకింగ్ క్లర్క్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. థియేటర్‌లో పనిచేస్తున్న రోజుల్లో ప్రతిరోజూ సినిమాలు చూస్తూ వాటి గురించి విశ్లేషించేవారు. ఒకసారి గేటు పక్కన నిలబడి సినిమా చూస్తూ అందులోని సన్నివేశాల గురించి విమర్శిస్తూ మాట్లాడారు. తన్కెతే ఇలాంటి సినిమాలు వంద తియ్యగలను అన్నారు. అతని మాటలు పక్కనే ఉన్న ప్రముఖ నిర్మాత ఎస్.భావనారాయణ విన్నారు. సినిమాలపై అతనికి ఉన్న ఆసక్తిని గమనించి అతన్ని మద్రాస్ రమ్మన్నారు. అక్కడ ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించారు. అలా 20 సినిమాలకు పనిచేశారు. ఆ తర్వాత డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేరారు. ఆయన పనిచేసిన తొలి సినిమా ఎన్టీఆర్ హీరోగా వచ్చిన బందరాముడు. దాదాపు 10 సంవత్సరాల పాటు భావనారాయణ సంస్థలోనే పనిచేసిన దాస్ అదే సంస్థ నిర్మించిన లోగుట్టు పెరుమాళ్ళ కెరుక చిత్రంతో దర్శకుడయ్యారు.

మూడో చిత్రం కె.ఎస్.ఆర్.దాస్ తెరకెక్కించిన రౌడీరాణి. ఈ సినిమాలో విజయలలిత హీరోయిన్. దక్షిణాదిన ఇదే తొలి హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ కావడం విశేషం. ఇది చాలా పెద్ద హిట్ కావడంతో దాస్‌కు అవకాశాలు వెల్లువెత్తాయి. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 100కి పైగా క్రైమ్, జేమ్స్‌బాండ్, యాక్షన్, జానపద, సాంఘిక చిత్రాలను డైరెక్ట్ చేశారు. వాటిలో ఎక్కువ శాతం విజయం సాధించాయి. ముఖ్యంగా క్రైమ్ అండ్ యాక్షన్ మూవీస్ ఒరవడి పెంచిన ఘనత ఖచ్చితంగా కె.ఎస్.ఆర్.దాస్‌దే. తను చేసే సినిమాల టైటిల్స్ దగ్గర నుంచి హీరో గెటప్స్ వరకు అన్నీ ప్రత్యేకంగానే ఉండేవి. సూపర్ స్టార్ కృష్ణ కాంబినేషన్‌లో దాస్ చేసిన మొదటి సినిమా టక్కరి దొంగ చక్కని చుక్క. ఈ సినిమా ఘనవిజయం సాధించడంతో వీరి కాంబినేషన్‌కి తిరుగు లేకుండాపోయింది. ఇద్దరూ కలిసి 30 సినిమాలు చేశారంటే.. ఈ కాంబినేషన్‌కి ఎంత ఆదరణ ఉండేదో అర్థం చేసుకోవచ్చు. జేమ్స్‌బాండ్ 777, మోసగాళ్ళకు మోసగాడు, హంతకులు దేవాంతకులు, దొంగలవేట, ఏజెంట్ గోపి, దొంగలకు సవాల్, అన్నదమ్ముల సవాల్, భలేదొంగలు, ఈనాటి బంధం ఏనాటిదో వంటి సినిమాలు సంచలన విజయాలు సాధించాయి. కుటుంబ కథా చిత్రాల్లో, సెంటిమెంట్ సినిమాల్లోనూ తన ప్రత్యేకత చాటుకున్నారు దాస్.

మెగాస్టార్ చిరంజీవితో రోషగాడు, బిల్లా%-% రంగా, పులి బెబ్బులి వంటి సినిమాలు రూపొందించారు. శోభన్‌బాబుతో లోగుట్టు పెరుమాళ్ళ కెరుక, గిరిజా కళ్యాణం, చేసిన బాసలు వంటి సినిమాలు చేశారు. ఇంకా కాంతారావు, రామకృష్ణ వంటి హీరోలతో కూడా సినిమాలు చేసిన దాస్.. ఏఎన్నార్‌తో ఒక్క సినిమా కూడా చెయ్యలేదు. 80 సినిమాలకు పైగా డైరెక్ట్ చేసిన తర్వాత ఎన్టీఆర్‌తో యుగంధర్ వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని రూపొందించారు. కన్నడలో 20 సినిమాలు చేసిన దాస్.. అందులో 14 సినిమాలు హీరో విష్ణువర్ధన్‌తోనే చేయడం విశేషం.

ఇక నిర్మాతగా 18 సినిమాలు నిర్మించారు. ఇండియాలోనే తొలి కౌబాయ్ సినిమా మోసగాళ్ళకు మోసగాడుని డైరెక్ట్ చేసిన ఘనత కె.ఎస్.ఆర్.దాస్‌కి దక్కుతుంది. ఆయన చేసిన సినిమాలు కమర్షియల్ హిట్స్ సాధించినా అవి యాక్షన్ అండ్ క్రైమ్ చిత్రాలు కావడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి అవార్డులు రాలేదు. అయితే కన్నడ ప్రభుత్వం పుట్టన్న కణగల్ అవార్డుతో కె.ఎస్.ఆర్. దాస్‌ను సత్కరించింది. థియేటర్‌లో బుకింగ్ క్లర్క్‌గా పనిచేసిన దాస్.. ఆ సమయంలో ఛాలెంజ్ చేసినట్టుగానే ఇండస్ట్రీకి వచ్చి 100కి పైగా సినిమాలను రూపొందించారు. ఆయన చివరి చిత్రం 2000లో వచ్చిన నాగులమ్మ. ఆ తర్వాత వయసు రీత్యా వచ్చిన ఆరోగ్య సమస్యల వల్ల సినిమాలకు దూరంగా ఉన్నారు. చివరికి 2012 జూన్ 8న చెన్నయ్‌లోని అపోలో ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు కె.ఎస్.ఆర్.దాస్.



# యూత్ @ 50

## మధ్యవయస్సు పొడిగింపు

"వయసుతో పని ఏముంది,మనసులోనే అంతాఉంది" సినీ కవి అన్నట్లు అక్షరాలా అదే కాన్సెప్ట్ ను తమ జీవితానికి అన్వయించుకుంటున్నారు నేటి తరం. నేటి యువత ముందు కేరీర్ ...ఆ తరువాతే పెళ్లి,పిల్లలు అంటున్నారు.విదేశాలకు వెళ్లి తాము ఆర్థికంగా,కేరీర్ పరంగా అనుకున్నది సాధించే వరకూ స్థిరపడానుకోవడంలేదు.40 తరువాతే జీవితం అంటున్నారు.50 వరకూ తాము యూత్ గా ఫీలవుతున్నారు.వారు అనుకున్నది సాధించే వరకూ సంసార బంధాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల కొంతమంది పిల్లలే వద్దు, తామిద్దరమే అనే ధోరణిలో ఉన్నారు.మరికొంతమంది పెళ్లే వద్దు...సహజీవనం అనే కాన్సెప్ట్ లో జీవిస్తున్నారు.అసలు వారి జీవితం 35-40 లలో ప్రారంభమవుతున్నది...అప్పుడు అనుభవించక పిల్లలు..బాదరబందీ అనేది ఎందుకు అనుకుంటున్నారు.కొంతమంది అసలు మగాడితో పనేముంది...సింగిల్ గానో లేదా సింగిల్ మదర్ గానో ఉంటున్నారు.స్వాతంత్ర్యం నాటికి సగటు వయస్సు 32 ఏళ్లు.ఇప్పటి సగటు వయస్సు 65-70 వరకూ పెరిగింది. వైద్యవిద్య చదివే యువత వారి కోర్సు పూర్తి అయ్యి వృత్తి మొదలయ్యేసరికి 35-40 వయస్సు వస్తోంది. సాఫ్టువేర్,ఇతర వృత్తి కోర్సులు చదివిన వారు తమ జీవితం అప్పుడే ప్రారంభమవుతుందని చెబుతున్నారు.మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి బాల్యవివాహాలు జరిగేవి.జీవితం చిన్నవయసు లోనే ప్రారంభం అయ్యేది.20 ఏళ్ల లోపు వివాహాలు జరిగేవి.డిగ్రీ,పీజీతో చదువు చాలనుకుని, ఉద్యోగం చూసుకునేవారు.భార్యాభర్తల మధ్య అవగాహన ఉండేది. చిన్న,పెద్ద పొరబాట్లు పెద్దల సహాయంతో పరిష్కరించుకుని జీవితకాలం కలిసుండేవారు.40ఏళ్లకు మనవలు,మనవరాళ్లు పుట్టేవారు.దాంతో వారు మానసికంగా మధ్యవయస్సు వారిగా పెద్దరికంగా ప్రవర్తించేవారు.60ఏళ్లు నిండగానే షష్ఠి పూర్తి ఘనంగా చేసుకునేవారు.జీవితంలో మధురిమలు తల్చుకుంటూ ఒకరికి ఒకరు తోడుగా చివరివరకూబతికేవారు.

నేటి తరం ఉన్నత విద్యావంతులు.వ్యక్తిత్వం కలవారు.దాంతోనే అసలు సమస్యే వస్తున్నది.ఏ విషయంలోనూ రాజీ పడరు.తమమాటే నెగ్గాలనే పట్టుదల ఎక్కువ. ఇగోలతో ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి పెద్దదిగా ఊహించి గొడవ పడుతున్నారు.పిల్లలు వద్దనుకుంటే పర్వాలేదు లేకపోతే విభేదాలు పెరిగి విడాకుల వరకూ వెళితే వారి భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడుతున్నది. పిల్లలున్నా వారి భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు.కేవలం వ్యక్తిగత స్వార్థం తప్ప కుటుంబం, సంబంధాలు గూర్చి ఆలోచన లేదు. వైద్యసౌకర్యాలు,వ్యాయామం,యోగా వల్ల 50 ఏళ్లు వచ్చేవరకూ దృఢంగా ఉంటూ యువత గానే ఫీలవుతున్నారు.గతంలో 60 ఏళ్ల తరువాత పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకునేవారు.నేడు 60 ఏళ్లకు రిటైర్ అయినా మరో10 సంవత్సరాలు వృత్తిని కొనసాగిస్తున్నారు.యోగా,వ్యాయామం జిమ్ కి వెళ్లి చేస్తూ వైద్యుల సలహా మేరకు ముసలితనం వాయిదా వేస్తున్నారు. మానసికంగా ఉత్సాహంగా ఉంటే వృద్ధాప్యం రాదనే భావనతో నేటితరం ఉన్నారు.మేధావులు, మానసిక శాస్త్రవేత్తలు కూడా అదే చెబుతున్నారు.జనాభా లెక్కల ప్రకారం పనిచేస్తున్న వృద్ధులు సంఖ్య నానాటికి పెరుగుతుందని తెలుస్తోంది.వారు దృఢంగా ఉన్నందువల్లే 70 ఏళ్ల వయస్సులోనూ పనిచేయగలుగుతున్నారని లెక్కలు చెబుతున్నాయి.

ఈ పరిణామం సమాజానికి ఉపయోగమా అనేది ఇదమిద్ధంగా చెప్పలేం.పిల్లల్ని లేటు వయస్సులో కలుగడం వల్ల ఇలాంటి పరిస్థితి కలుగుతున్నదని శాస్త్రవేత్త లు భావిస్తున్నారు. వారు ఆరోగ్యంగా ఉంటూ పనిచేయడం వల్ల ఎలాంటి సమస్యా రాదంటున్నారు.కాని నేటితరం పెళ్లి దూరంగా ఒంటరిగా ఉండడమే సమస్య అంటున్నారు.నేటి తరం ఇలాగే ఉంటే భవిష్యత్లో యువత సంఖ్య తగ్గి వృద్ధులు పెరిగి మరో జపాన్ కావచ్చంటున్నారు విశ్లేషకులు.

భారతీయ సమాజానికి వివాహ బంధమే బలమైన పునాది.నేటి తరం ఆ పునాదులను కదిలిస్తున్నారు.సహజీవనం, వివాహేతర సంబంధాలు పెరిగి భవిష్యత్తు పౌరులటబాలల)పై తీవ్ర మైన ప్రభావం పడుతుందని మానసిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. స్వేచ్ఛ తోపాటు వివాహబంధాన్ని గౌరవించడం ద్వారా భారతీయ సంస్కృతి కాపాడాల్సిన బాధ్యత నేటి యువత మీద ఉంది. అందుకు తల్లిదండ్రులు వారిని మానసికంగా సిద్ధం చేయడం తప్పనిసరి.

**యం.వి.రామారావు, 8074129668**

# విశాఖ జిల్లా సమాచారం

## నేత్రపర్వంగా శ్రీ విశ్వేశ్వర స్వామి వారి కళ్యాణం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ విశ్వేశ్వర స్వామి వారి కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారితో కళ్యాణ్ వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు మధ్య కళ్యాణం చూడ ముచ్చటగా జరిగింది. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ నూతన దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయ ప్రయాణంలో జరిగిన ఈ కళ్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ మేనేజర్ అడపా దేముళ్ళు పర్యవేక్షణలో ఈ కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది.కళ్యాణ అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకలు ఈ నెల 12వ తేదీ వరకూ జరుగుతాయి.

## చురుగ్గా గుమ్మ-పొర్లువలస రహదారి పనులు



**అనంతగిరి, (విశాఖ సమాచారమ్):-** మండలంలో గుమ్మ గ్రామపంచాయతీ కేంద్రం నుంచి పొర్లువలస వరకు 11 కిలోమీటర్లు గాను 11 కోట్లతో నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దింతో ఆయా గ్రామాల గిరి హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేనప్పుడు తీవ్ర ఇబ్బందులు పడేవారమని గిరిజనులు వాపోయారు. వ్యాధులు సంభవించినప్పుడు రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు డోలిమోతలే దిక్కయిందని, ఆవేదన వ్యక్తం చేసారు..ఒక్కో సమయంలో రోగిని అస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని గిరిజనులు తమ వేదన వివరించారు.. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరం నాటికి మా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లో రహదారి నిర్మానికి నిధులు మంజూరు చేయడమే కాక రోడ్డు పనులు వేగవంతం చేసింది. గుమ్మ పంచాయితీలోని నిమ్మఊట, దిగుముల్లెలు, ఎగుముల్లెలు, మిర్తిదుంగడ, మద్దిపాడు, బూసిపాడు, కరకవలస, పోర్లువలస గ్రామాలకు మేలు చేకూరనుంది.గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆయా గ్రామాల గిరిజనులు వాపోయారు.

## రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి




**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలను రాష్ట్రంలో తక్షణమే నిలిపివేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. కార్పొరేట్లు కళ్ళల్లో సంతోషం చూడడం కోసం కార్మిక హక్కులను పణంగా పెట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు పోటీ పడుతున్నాయని గని శెట్టి అన్నారు. 29 కార్మిక చట్టాలు ఏకపక్షంగా రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తేవడంలోనే దాని కార్పొరేట్ విధేయత స్పష్టంగా కనిపించింది అన్నారు. 8 గంటల పనికోసం 1886 చికాగో నగరంలో పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకం అన్నారు . కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది మండిపడ్డారు . సంపద సృష్టికర్తలు శ్రామికులనేది జగమెరిగిన సత్యం. కాని దానిని నిన్నకాక మొన్న సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులేనని చంద్రబాబు చెప్పారంటే కార్మికుల శ్రమను ఎంత తక్కువ చేసి చూస్తున్నారో అర్ధమౌతుంది అని గని శెట్టి అన్నారు. దీనికి వ్యతిరేకంగా జూల్కై 9న జరగనున్న జాతీయ సమ్మెకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . కార్మికవర్గం ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ దాడిని ప్రతిఘటించాలని గని శెట్టి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ వెంకునాయుడు, కే అర్జున్, ఎన్ గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

# సమూల మార్పుల దిశగా ఏయు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** సమూల మార్పుల దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.పీ రాజశేఖర్ పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం పరిపాలనకు సంబంధించి డీన్ లను, డైరెక్టర్లను పూర్తిస్థాయిలో మార్పు చేశారు.లి నూతనంగా డీన్ ఫ్యాకల్టీ ఆఫైర్స్, డిన్ అవుట్ రీడ్, డీన్ ఆలుమ్నీ రిలేషన్స్, డీసీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ అండ్ మేనేజ్మెంట్, చీఫ్ కోఆర్డినేటర్ స్పాట్ వాల్యుయేషన్ వంటివి ఏర్పాటు చేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందిస్తూ సేవలు మరింత వేగవంతం చేసే దిశగా అవసరమైన సంస్థాగత మార్పులు చేపడుతున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య జిపి రాజశేఖర్ అన్నాడు. శుక్రవారం ఏయూ అకడమిక్ సినేట్ మందిరంలో ప్రిన్సిపాల్, బోధనా సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల మూల్యాంకన విధానాన్ని మరింత పటిష్టం చేసి దీశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయాన్ని పూర్వ విద్యార్థులతో అనుసంధానించడం, వారి సేవలను గుర్తించి సత్కరించడం, గౌరవించడం ఎంతో అవసరమని అన్నారు. ఈ దిశగా వర్సిటీ పరిపాలనలో సంస్థాగతంగా పలు మార్పులను చేపడుతున్నట్లు వెల్లడించారు.

బోధన, పరిశోధనలను పటిష్టం చేసే చర్యలలో భాగంగా తొలిసారిగా విభాగాలలో ఆచార్యులకు వృత్తిపరమైన భారాన్ని అండనా వేస్తూ పరిష్కారాలను చూపే దిశగా చర్యలు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. బోధనా సిబ్బందికి సంబంధించిన అంశాలను, సమస్యలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ఉపయుక్తంగా నూతనంగా ప్యాకల్టీ ఎఫైర్స్ కోసం ఒక ప్రత్యేకంగా డీన్ ను నియమించారు.

బలమైన పూర్వ విద్యార్థులను సంపదగా కలిగిన ఏయు తో వారిని అనుసంధానం చేస్తూ, పూర్వ విద్యార్థుల సంఘంలో సమన్వయంగా పనిచేసే వ్యవస్థను నిర్మించడానికి తొలిసారిగా డీన్ ఆలుమ్ని రిలేషన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు విసి ప్రకటించారు.

యూనివర్సిటీ ప్రతిష్టను ప్రస్ఫుటం చేసి విదంగా, విద్యాసంబంధి కార్యక్రమాల నిర్వహణ. పరిశ్రమలు, ప్రభుత్వం తో సమన్వయం చేస్తూ పనిచేసి విదంగా ప్రత్యేకంగా డీన్ అవుట్ రీచ్ ను నూతనంగా ఏర్పాటు చేశారు. ఎన్పీటిఈఎల్, స్వయం, మూక్స్ వంటి కోర్సుల నిర్వహణ సంబంధిత అంశాలపై ఒక ప్రొఫెసర్ ఇంచార్జ్ యూనివర్సిటీ బ్రాండింగ్- మీడియా అంశాలకు సంబంధించి ఒక ప్రొఫెసర్ ఇంచార్జ్ ను, ఐక్యూఏస్ కోఆర్డినేటర్ ను డిన్ ఔట్రీడ్ పరిధిలో సమన్వయం చేస్తూ పని చేసే దిశగా నూతన వ్యవస్థను నిర్మాణం చేశారు.

ప్రశ్నాపత్రాల మూల్యాంకనం విధానాన్ని మరింత పటిష్టం చేసే దిశగా స్పాట్ వాల్యుయేషన్ విభాగానికి చీఫ్ కోఆర్డినేటర్ ను నియమించారు ఈ భాగంలో సమూల మార్పులు తీసుకురానున్నట్లు విసి వెల్లడించారు.

డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్- సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఓపెన్ లెర్నింగ్ లను అనుసంధానం చేస్తూ నూతనంగా ఒకే డైరెక్టర్ పరిధిలోకి వీటిని తీసుకువస్తూ పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాడు.

విద్యార్థుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ కొత్తగా డిమ్ స్టూడెంట్ వెల్ఫేర్ ఏర్పాటు చేస్తూ... ఈ విభాగం కింద ఎన్.సి.సి, ఎన్ఎస్ఎస్ కళలు విభాగాలను తీసుకువచ్చారు. విద్యార్థులను విభిన్న రంగాలలో ప్రతిభావంతులుగా, భవిష్యత్తు నాయకులుగా మలచడానికి ఉపయోగంగా ఈ విభాగం పనిచేస్తుంది.

ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ మేనేజ్మెంట్ అంశాలను సమన్వయం చేస్తూ నూతనంగా ఒక డిన్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన సివిల్, ఎలక్ట్రికల్ ట్రాన్స్పోర్ట్. సెక్యూరిటీ తదితర సేవలను సమన్వయం చేస్తూ, మౌలిక వసతులు కల్పనను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. ఈ విభాగం పర్యవేక్షణలో ఉన్న హాస్టల్స్ లో కిచెన్ డ్రైవింగ్ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని వీసీ ఆదేశించాడు.

రీసెర్చ్ డెవలప్మెంట్ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తూ డీసీ పరిధిలోదీనికి అనుసంధానంగా పనిచేయడానికి ప్రాజెక్ట్స్ ఐపీఆర్ విభాగాన్ని తీసుకువస్తూ ఇన్చార్జిను నియమించారు. నియమించారు.

నూతనంగా నియమితులైన అధికారుల వివరాలను స్వయంగా వీసీ ఆచార్య రాజశేఖర్ వెల్లడించారు. లిఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు రాజు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పంచకర్ల

**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన జనసేన కార్యకర్త మైలపల్లి బంగార్రాజు పెద్ద కర్మ సందర్భంగా శనివారం బంగార్రాజు కుటుంబ సభ్యులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎన్టిపిసి యాజమాన్యంతో చర్చించి బంగారు రాజు చేస్తున్న మెయింటినెన్స్ ఉద్యోగాన్ని బంగార్రాజు భార్య కు ఇవ్వమని ఎన్టిపిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్టిపిసి బాలభారతి పబ్లిక్ స్కూల్లో బంగారు రాజు ఇద్దరు ఆడపిల్లలకు ఫ్రీ అడ్మిషన్ ఇవ్వవలసిందిగా జిల్లా కలెక్టర్ ను కోరారు.తక్షణమే కలెక్టర్ విజయకృష్ణన్ స్పందించి ఎన్టిపిసి యాజమాన్యం తో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్వయంగా 20 లక్షల రూపాయలు మృతుడి కుటుంబానికి ప్రకటించారు. ఈ సందర్భంగా జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్ 50 వేలు రూపాయలు, ప్రకటించారు. జన సైనికులు చాలామంది తోచిన సహాయం చేయడానికి ముందుకు వచ్చారు, పరవాడ జనసేన పార్టీ ఆఫీసులో మృతిని జ్ఞాపకార్థం సంస్కరణ సభ పరవాడలో ఏర్పాటు చేసి మృతిడి కుటుంబానికి జనసేన పార్టీ నుండి ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల



రమేష్ బాబు నాయకులకు కార్యకర్తలకు కోరారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్, గ్రామ సర్పంచ్ ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు, చింతకాయల సుజాత ముత్యాలు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్, సీనియర్ జనసేన పార్టీ నాయకులు రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, నాయుడుపాలెం ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు మధు, వెన్నెల నర్సింగరావు, అనిల్ ,ముత్యాలమ్మపాలెం ఎంపిటిసిలు అర్జిల్లి దేవిరవి మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు,మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు నష్టదాయకమైన నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి : సిఐటీయు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** కార్మిక వర్గానికి నష్టదాయకం గా రాష్ట్రంలో కార్మిక చట్టాలను మారుస్తూ క్యాబినెట్ నిర్ణయించడాన్ని సిఐటియు ఖండిస్తున్నది. ఆ మార్పులను ఉపసంహరించుకోవాలని ఈరోజు అచ్చుతాపురంలో జరిగిన కార్యక్రమం సేటు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము అస్తాపురం మండల కన్వీనర్ కే సోమినాయుడు మాట్లాడుతూ 50 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్న షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్లో గత 13 సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ జరగలేదు. కనీస వేతనాల బోర్డును నియమించలేదు. 20 లక్షల మందికి పైగా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్దరించలేదు. కాంట్రాక్: ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమావేతనం అమలు చేయడం లేదు. వీటి అమలుపై చంద్ర బాబు నాయుడు కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. కానీ మోడీ ప్రభుత్వ విధానాలను అమలు చేయడానికి తహ తహలాడు తున్నది. కార్పొరేట్ల ప్రయోజనం కోసం పని గంటలు, ఓటి కాలాన్ని సాధికారిత పేరిట రక్షణ కల్పించకుండా మహిళల చేత రాత్రిపూట పని చేయించాలని నిర్ణయించింది. నిజంగా కార్మికులపై చిత్త శుద్ధి ఉంటే పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాల సవరణ వెంటనే చేయాలని, మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలని, కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త లేబర్ కోడ్స్ తెచ్చి, కార్మికవర్గం హక్కులు హరించ చూస్తున్న బీజేపీ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పరిపాలన సాగిస్తున్నది.

కార్మిక హక్కులపై దాడి చేస్తున్నది. దానిలో భాగంగానే లేబర్కోడ్ను తెచ్చింది. మన రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అదే విధానాలను అమలు చేస్తున్నది, అచ్చుతాపురం ఎస్సీ జడ్, ఫార్మా, అధిష్టాన్ వంటి పరిశ్రమలో మహిళలతో రాత్రి వేళల్లో పని చేయించడానికి వీలుగా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే మహిళలకు రక్షణ కరవైన నేపథ్యంలో మహిళలకు రక్షణ కల్పించకుండా రాత్రిపూట పని చేయించాలనుకోవడం అవివేకం. అటువంటి రక్షణ చర్యలు రాష్ట్రంలో లేకపోవడం వలన మహిళలపై దాడులు జరుగుతున్నాయి. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగించడానికే రాష్ట్ర క్యాబినెట్ ఇటువంటి నిర్ణయాలు చేసింది. ఈ నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో మారిశెట్టి .అప్పారావు, బోరా. శంకర్రావు, వాసుపల్లి. కాసుబాబు, నూకమ్మ ,దర్గా, నాగమణి పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నైరుతి రుతుపవనాలు మొహం చాటెయ్యడంతో, రోజురోజుకీ పెరుగుతున్న ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించడం కోసం నేటినుండి అల్లూరి విజ్ఞాన కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ ఇంచార్జ్ శ్రీ జి ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ మజ్జిగ కేంద్రం ఉదయం 11 నుండి మధ్యాహ్నం వరకూ ప్రతీ రోజూ నిర్వహిస్తామని వర్షా కాలం మొదలయ్యేవరకూ కొనసాగిస్తామని, విజ్ఞాన కేంద్రం ఇప్పటికే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, ప్రతీ రోజూ ఉచిత మెడికల్ చెకప్, ప్రతీ మూడవ మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, మరికొద్ది రోజుల్లో టైలరింగ్ శిక్షణ కేంద్రం కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు.

మజ్జిగ కేంద్రాన్ని లలితా కాలనీ సెక్రటరీ శ్రీమతి శారదాదేవి గారు ప్రారంభించగా, మాజీ ఎన్ ఎల్ సి అధికారి శ్రీ గుప్తా గారు, మహిళా కార్యకర్త శ్రీమతి సరోజినీ గారు మజ్జిగ పంపిణీ లో పాల్గొని సహకరించారు.

పెద్ద సంఖ్యలో ప్రజలు వినియోగించుకున్న ఈ కార్యక్రమానికి అల్లూరి కార్యక్రమాల కమిటీ సభ్యులు బుజ్జి, సి హెచ్ సత్యనారాయణ, ఎల్లాజీ, వై. సత్యనారాయణ మరియు వై. రాజు, మౌళి తదితరులు నాయకత్వం వహించారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ కరెంట్ ఎఫైర్స్

దీంతోపాటు గాజాను ఖాళీ చేయించే విషయంలో, దానిని స్వాధీనం చేసుకునే విషయంలో సీరియస్‌గానే ఉన్నానని వివరించారు. అమెరికా దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికోసహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందని ప్రకటించారు. దీనిపై ఆదేశాలిస్తానని తెలిపారు. మరిన్ని రంగాల్లోనూ సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు.

అమెరికాపై సుంకాలను విధించే దేశాలు, వస్తువులపై ప్రతి సుంకాలను విధిస్తానని తెలిపారు. 'వారు మన ఉత్పత్తులపై 130శాతం సుంకాలు విధిస్తుంటే మనం ఏమీ విధించకపోవడం సరికాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్య సంస్థల్లో ఆందోళన నెలకొంది. స్టాక్ మార్కెట్లు తీవ్రంగా నష్టపోయాయి.

**09 ఫిబ్రవరి**

**నెత్జరీమ్ నుంచి వైదొలగుతున్న ఇజ్రాయెల్**

ఉత్తర, దక్షిణ గాజాలను వేరు చేసే ఆరు కిలోమీటర్ల నెత్జరీమ్ నడవా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ ప్రారంభమైంది. గాజా కాల్పుల విరమణ తొలి దశ ఒప్పందంలో ఇదో కీలకాంశం. అయితే రెండో దశ కాల్పుల విరమణ కోసం ప్రారంభం కావాల్సిన చర్చలపైనే ఇప్పుడు అనుమానాలు తలెత్తుతున్నాయి. చర్చల కోసం ఖతార్‌కు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన బృందాన్ని పంపారు. ఇందులో సీనియర్ అధికారులెవరూ లేకపోవడంతో చర్చలు విఫలమవుతాయన్న ఊహాగానాలు చెలరేగుతున్నాయి. గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వైదొలగడం రెండో దశ చర్చల ఒప్పందానికి కీలకం.

**08 ఫిబ్రవరి**

**పరిశోధనలపైనా ట్రంప్ వేటు**

వర్ధమాన దేశాలకు ఆర్థిక సహాయాన్ని స్తంభింపజేసిన డొనాల్డ్ ట్రంప్.. స్వదేశంలో పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ)కీ ఆటంకం సృష్టిస్తారని ఆందోళన రేగుతోంది. ఆర్అండ్‌డీలో అల్పసంఖ్యాక వర్గాలు, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికీ, సమానత్వ సాధనకు అమెరికా ప్రభుత్వం ఇంతకాలం ప్రాధాన్యమిస్తూ వచ్చింది. దీన్ని డైవర్సిటీ (వైవిధ్యం), ఈక్విటీ (సమానత్వం), ఇన్‌క్లూజన్ (సమ్మిళిత) (డీఈఐ) విధానమంటారు. దీనికింద ఇస్తున్న రుణాలు, గ్రాంట్లను స్తంభింపజేస్తూ ట్రంప్ జనవరి 21న కార్యనిర్వాహక ఉత్తర్వు జారీచేశారు.

దీన్ని ఇద్దరు న్యాయమూర్తులు అడ్డుకోవడంతో ట్రంప్ సర్కారు ఆ ఉత్తర్వును రద్దుచేసింది. 2023లో అమెరికాలోని వర్సిటీలకు ఆర్అండ్‌డీ నిమిత్తం 6,000 కోట్ల డాలర్లు అందాయి. ట్రంప్ విధానం తమపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని వర్సిటీలూ అనుమానిస్తున్నాయి. కృత్రిమ మేధపై పరిశోధనను ఇప్పటికే ఆపాయి.

**04 ఫిబ్రవరి**

**అమెరికా టారిఫ్‌లపై చైనా ప్రతీకారం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలపై చైనా ప్రతీకార చర్యలకు దిగింది. అమెరికా టెక్ సంస్థ గూగుల్‌పై విచారణకు ఆదేశించడమే కాకుండా.. ఆ దేశ వస్తువులపై కొత్త సుంకాలు విధించింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జీ) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది.

ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్లు తెలిపింది. అలాగే యాంటీ ట్రస్టు చట్టాలను ఉల్లంఘించిన ఆరోపణలతో గూగుల్‌పై విచారణకు ఆదేశించినట్లు డ్రాగన్ పేర్కొంది.

ఎల్ఎన్‌జీకి ప్రపంచంలోనే అతి పెద్ద దిగుమతిదారుగా చైనా ఉంది. అమెరికా అతి పెద్ద ఎగుమతిదారుగా ఉంది. అమెరికా నుంచి ఇది పెద్దగా చైనాకు రాదు. ఆస్ట్రేలియా, ఖతార్, మలేసియాల నుంచి ఎల్ఎన్‌జీని చైనా ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. 2023లో కేవలం 2.3శాతం ఎల్ఎన్‌జీనే చైనాకు అమెరికా పంపింది.

**రష్యాతో భారత్ ఒప్పందం**

నౌకా విధ్వంసక క్రూజ్ క్షిపణుల కొనుగోలుకు భారత్ 2025, ఫిబ్రవరి 4న రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అస్త్రాల రాకతో భారత నౌకాదళంలోని జలాంతర్గాముల పోరాట సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

**02 ఫిబ్రవరి**

**మెక్సికో, కెనడా, చైనాలపై సుంకాల కొరడా**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు! ముందునుంచీ హెచ్చరిస్తున్నట్టుగానే తమ పొరుగుదేశాలైన మెక్సికో, కెనడాలతోపాటు చైనాపైనా సుంకాల కొరడా ఝళిపించారు. దీర్ఘకాలిక మిత్రదేశాలైన కెనడా, మెక్సికోల నుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25% చొప్పున, చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై 10% సుంకం విధిస్తూ తాజాగా కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికాలోకి ఫెంటానిల్ అక్రమ రవాణాను, అక్రమ వలసలను అడ్డుకునేందుకే తాను ఈ చర్యకు ఉపక్రమించినట్లు ప్రకటించారు. మెక్సికో, కెనడా, చైనా.. అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామ్య దేశాలు కావడం గమనార్హం. తాజా పరిణామంతో ఉలిక్కిపడ్డ మెక్సికో, కెనడా.. ప్రతీకార చర్యలకు రంగం సిద్ధం చేసుకునున్నాయి

**- డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి**

**విశాఖ సమాచారమ్ 9553574250**

## కార్పొరేటర్లకు వార్డు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలి : కె.కె రాజు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జీవీఎంసీ పరిధిలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన కార్పొరేటర్లకు ఆ వార్డు పరిధిలో అభివృద్ధి పనులు కోసం నిధులు కేటాయించాలని విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె.కె రాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్రజాస్వామ్యంగా మేయరును దించేసి కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, ఇప్పటికైనా ప్రజలకు న్యాయం చేసే విధంగా ఎమ్మెల్యేలకే కాకుండా ప్రతి వార్డులో ఆయా వార్డు కార్పొరేటర్లు ద్వారా నిధులు కేటాయించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## గోదావరి జిల్లాల సమాచారమ్

## నేత్రపర్వం.. బాలబాలాజీ కల్యాణం



**మామిడికుదురు, (విశాఖ సమాచారమ్):–** పవిత్ర వైనతేయ నదీ తీరంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సుముహూర్త సమయంలో వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు మిన్నంటగా, గోవింద నామస్మరణలు చేస్తున్న భక్తుల ఆధ్యాత్మిక కోలాహలం నడుమ కల్యాణ క్రతువు రమణీయంగా సాగింది. వేదపండితులు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, గొడవర్తి శ్రీనివాస్‌లు ముహూర్త సమయాన జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉత్సవమూర్తుల శిరస్సులపై ఉంచడం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను భక్తులు వీక్షించారు. కల్యాణోత్సవానికి సకల దేవతాగణాన్ని ఆహ్వానిస్తూ తొలుత గరుడ ధ్వజపటాన్ని ఎగురవేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి వాయిద్యాలు, కోలాట భజన కీర్తనలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎంపీపీ కుసుమ వనజకుమారి, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, సీఐ భీమరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆలయ ఏసీ ఎం. సత్యనారాయణరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు. పలు దేవస్థానాల నుంచి వచ్చిన పట్టువస్త్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.

## నిత్యం పరీక్షే...



**నిడదవోలు, (విశాఖ సమాచారమ్):–** నిడదవోలు రైల్వేగేటు వద్ద ప్రస్తుతం ఆర్వోబీ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల పరిస్థితి ఎలా ఉన్నా... కనీసం వాహనదారులు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు ఇక్కడ నిత్యం పరీక్షగానే మారింది. నిడదవోలు పట్టణంలోని గాంధీబొమ్మకూడలి నుంచి రైల్వేగేటు వరకు, రైల్వేగేటు నుంచి పాత పురపాలక సంఘ కార్యాలయం వరకు వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. శుక్రవారం రైల్వేగేటు నుంచి పాత పురపాలక సంఘ కార్యాలయం వరకు మూడు ఆర్టీసీ బస్సులు, ఒక లోడు ట్రాక్టర్ దిగబడిపోయాయి. ఉదయం తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఓ మెస్ ఎదురుగా దిగబడింది. దీనిని అతి కష్టం మీద బయటకు తీశారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న రెండు ఆర్టీసీ బస్సులు దిగబడి పోయాయి. చివరకు ప్రయాణికులే వాటిని గెంటాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా అవి కదలకపోవడంతో పొక్లెయిన్ల సాయంతో బయటకు తీశారు.

## పని గంటల పెంపు నిర్ణయం తగదు



**భీమవరం, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్రంలో పని గంటలు పెంచేందుకు మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్రమైన ద్రోహం చేసి కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు 44 చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్లకు తెచ్చిందని పేర్కొన్నారు. 50 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్న షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో 13 ఏళ్లుగా కనీస వేతనాల సవరణ జరగకపోగా, కనీస వేతనాల బోర్డును నియమించలేదని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించలేదని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదని వీటిపై సీఎం చంద్రబాబు నోరు మెదపడటం లేదన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త లేబర్‌కోడ్స్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే రాత్రి సమయంలో కూడా మహిళలతో పనిచేయించేలా రూల్స్ రూపొందించడం అన్యాయమన్నారు. వీటిని అందరూ వ్యతిరేకించాలని కోరారు.

# ప్రభుత్వ పథకాలు అందాలంటే ఆధార్ అప్డేట్ తప్పనిసరి

● మరో నాలుగు రోజుల్లో తల్లికి వందనం పథకం. ● ఆధార్ అప్డేట్ అవ్వని ఎందరో విద్యార్థులు. ● గ్రామ/ వార్డు సచివాలయాల్లో అమలు కానీ ఆధార్ అప్డేట్ సౌకర్యం ● ఆందోళనలో విద్యార్థులు తల్లిదండ్రులు




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఆధార్ అప్డేట్ తప్పనిసరి అని ప్రభుత్వం వారు మెసేజ్ రూపంలో ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నారు. రాష్ట్రంలో తల్లికి వందనం పథకానికి సంబంధించి 81 లక్షల మంది విద్యార్థులు జాబితా కలదు. దీనిలో ప్రస్తుతం 69.16 లక్షల మంది విద్యార్థులు అర్హత సాధించగా, మిగిలిన 12.16 లక్షల మంది విద్యార్థులకు ఆధార్ అప్డేట్ అవ్వాల్సి ఉంది.

మరో నాలుగు రోజుల్లో తల్లికి వందనం పథకం అమలు చెయ్యబోతుండడంతో ఆధార్ అప్డేట్ అవ్వని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆధార్ సెంటర్ ల వద్దకు బారులు తీరుతున్నారు. కూలి పని మానుకొని రెండు నుండి మూడు రోజులు వారి పిల్లల ఆధార్ అప్డేట్ కొరకు సమయం వెచ్చించిన, ఆధార్ సెంటర్లో కంప్యూటర్లు మొరాయించడంతో ఆధార్ అప్డేట్ అవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. మరో ప్రక్క ప్రభుత్వం వారు దగ్గర్లో ఉన్న గ్రామ/ వార్డు సచివాలయాల్లో ఆధార్ అప్డేట్ చేయించుకోమని ప్రజలకు తెలియజేయడం జరిగింది. కానీ ఎక్కడ కూడా గ్రామ / వార్డు సచివాలయాల్లో ఈ ఆధార్ అప్డేట్ వ్యవస్థ కనిపించలేదని విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. మరో పక్క కొందరు విద్యార్థి తల్లిదండ్రులు ఇలా అంటున్నారు : పథకం ఇవ్వడమే చాలా ఆలస్యం అయింది దానితోడు ఆధార్ అప్డేట్ అంటూ మమ్ములను ఇలా ఆధార్ సెంటర్లు చుట్టూ తిప్పించుకోవడం ప్రభుత్వానికి మంచిది కాదని వారి బాధను వ్యక్తపరిచారు. సుమారు 12.16 లక్షల మంది విద్యార్థులు ఆధార్ అప్డేట్ అవ్వకపోవడం వల్ల విద్యార్థి తల్లిదండ్రులు ఈ ఆధార్ అప్డేట్ కి ప్రత్యయముగా మరో మార్గం ప్రభుత్వమే మాకు చూపించాలని కోరుతున్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వ పథకాలు సులభమైన మార్గంలో ప్రజలకు అందచేయాలంటూ ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అంతేకాకుండా ఈ ఆధార్ అప్డేట్ కార్యక్రమం ప్రతి ఇంటి వద్దకే వచ్చి పూర్తిచేస్తే మాకు కూలి పని మానుకోవాల్సిన పని ఉన్నదని కొందరి విద్యార్థి తల్లిదండ్రుల అభిప్రాయం.

# సెల్‌ఫోన్ గొడవ... స్నేహితుడి ప్రాణం తీసింది



కొవ్వాడి చిన్నబ్బులు (పాత చిత్రం)

**కోరుకొండ, (విశాఖ సమాచారమ్):–** సరదాగా అప్పటి వరకు కలసి స్నానాలు చేశారు. మద్యం తాగారు. ఎప్పుడూ కలసి ఉండే ఆ స్నేహితుల మధ్య సెల్‌ఫోన్ తెచ్చిన తంటా చివరికి అందులోని ఓ మిత్రుడి ప్రాణం పోవడానికి కారణమైంది.. కోరుకొండ మండలం నిడిగట్ల సమీపంలో జరిగిన ఆ దారుణహత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం గ్రామీణం వెంకటనగరానికి చెందిన కొవ్వాడి చిన్నబ్బులు అలియాస్ కాసులు(30) తన స్నేహితులైన రాజమహేంద్రవరానికి చెందిన వీరబాబు, ఆకుల గణేష్, దుర్గాసాయిలతో పాటు.. వివేక్, చిన్నబ్బాయి, తేజ అనే యువకులతో కలసి ఈ నెల 4వ తేదీన రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు స్థలం వద్ద స్నానం చేశారు. ఆ తరువాత దగ్గరలో మద్యం తాగారు. ద్విచక్రవాహనంలో పెట్రోలు అయిపోవడంతో తెచ్చేందుకు వీరబాబు, దుర్గాసాయి వెళ్లారు. ఇదే సమయంలో దుర్గాసాయి దగ్గర ఉన్న వీరబాబు సెల్‌ఫోన్ కిందపడి పగిలింది. ఆ విషయం చెప్పకుండా సదరు సెల్‌ఫోన్ వివేక్ వల్లే పగిలిపోయిందని వీరబాబుకు చెప్పడంతో ఆగ్రహంతో వివేక్‌ను కొట్టబోయాడు అతను. మేనల్లుడు వరుసైన వివేక్‌ను కొట్టబోతుంటే కాసులు అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ తరువాత సీతంపేట వద్ద అందరూ కలసి మరోసారి మద్యం తాగారు. మత్తులో మరోసారి వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వీరబాబు, ఆకుల గణేష్, సిమ్మ దుర్గాసాయిలను మరోసారి కాసులు తమ వారితో కలసి బెదిరించారు. జరిగిన గొడవలతో తనను చంపేస్తారేమోనని భయపడ్డ వీరబాబు.. స్నేహితులు శ్రీనివాసరెడ్డి, తరుణ్‌ల సాయంతో కాసులును చంపేయాలని నిర్ణయించుకున్నాడు. మాట్లాడుకుందామని చెప్పి కాసులును ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని నిడిగట్ల సమీపంలోని పొలాల్లోకి తీసుకువెళ్లారు. శ్రీనివాసరెడ్డి, తరుణ్ వారి వెంట తెచ్చిన బ్లేడులతో గొంతు కోశారు. వారంతా కలసి అక్కడే ఉన్న పెద్ద రాయితో కాసులు తలపై చితకబాది దారుణంగా హత్య చేశారు. ప్రధానంగా వీరబాబు, ఆకుల గణేష్, దుర్గాసాయి వీరికి సహకరించిన కర్రి శ్రీనివాసరెడ్డి, రేలంగి తరుణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. మృతుడికి భార్య మల్లిక, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడిపై గతంలో పలు వివాదాలకు సంబంధించి కేసులు నమోదవ్వడంతో పాటు, నిందితుల్లోనూ కొందరిపై గతంలో కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలాన్ని గురువారం ఉదయం అదనపు ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు వై.శ్రీకాంత్, దేవకుమార్, సీఐ వై.సత్యకిషోర్, ఎస్.ఐ కె.నాగరాజు పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన రాయిని కనుగొన్నారు. క్లూస్ టీం ఆ ప్రాంతాన్ని పరిశీలించింది. హత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుగా నమోదు చేసేందుకు పోలీసులు పరిశీలిస్తున్నారు.

## యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** జూన్ 21తేదిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కాకినాడలో 5000 మంది ఉపాధ్యాయులతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి టైటాన్ షోరూం వరకు, పాత బస్టాండ్ వద్దనున్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ భవన్, సినిమా రోడ్డులో గల సూర్య కళామందిర్ వంటి ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కలెక్టర్ శాన్మోహన్ సగిలి, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, జెసి రాహుల్ మీనా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గోవులను వీధుల్లో వదలడం మానుకోవాలి : మంత్రి నిమ్మల



పాలకొల్లు టవిశాఖ సమాచారంఉః జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గోవులను వీధుల్లో వదిలి వేయడం యజమానులు మానుకోవాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సూచించారు. యునైటెడ్ కాపు వనిత క్లబ్ పర్మినెంట్ ప్రాజెక్టులో భాగంగా పట్టణంలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గోవుల గరుకు స్తంభాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. తప్పనిసరిగా వదిలే వారు సైతం గోవులను తమ ఇళ్ల వద్దనే కట్టుకోవాలని సూచించారు. పట్టణంలో జక్కంపూడి మధన్, అల్లంవాణి యడ్లబజారులోనూ, డాక్టర్ ముచ్చర్ల సంజయ్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, కటికి అర్చన పూలపల్లి టర్నింగ్ వద్ద, తమ్మిరెడ్డి త్రినాధేశ్వరి శ్రీనివాస డీలక్స్ ఎదురుగా, డాక్టర్ వావలి ఉమాదేవి విశ్వమానవ వేదిక వృద్ధాశ్రమం వద్ద ఆవుల గరుకు స్తంభాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామమోహన్, జక్కంపూడి మదన్, మద్దాల వాసు, పోకల రాము, జక్కంపూడి కుమార్, రావూరి అప్పారావు, కానూరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పదోన్నతులు

**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):–** కొవ్వూరు , చాగల్లు.పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖలో .06.6.2025 న జరిగిన వివిధ ఉపాధ్యాయ పదోన్నతుల్లో కొవ్వూరు నియోజకవర్గం లోని పలువురు ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. కొవ్వూరు మండలం నుండి శ్రీమతి ఎస్. .ఉషారాణి దేవరపల్లి మండలం రంగ రాయ కాలనీ పాఠశాలకు పి.ఎస్. హెచ్ ఎమ్ గా నూ, ఔరంగాబాద్ కు చెందిన రాచర్ల సుధాకర్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ గా పోలవరం మండలం జెడ్ పి హెచ్ ఎస్ గూటాల కు, మెరుపో ప్రసాద్ మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ గా జెడ్ పి హెచ్ ఎస్ సిద్ధాంతంనకు, చాగల్లు మండలంనకు చెందిన బొల్లిపో మధుశేఖర్ జెడ్ పి హెచ్ ఎస్ యర్నగూడెం మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా, ఆకుల జ్యోత్స్న కుమార్ బయాలజీ టీచర్‌గా చిక్కాల హైస్కూలుకు పదోన్నతులు పొందినవారిలో ఉన్నారు. ఈవిషయమై కొవ్వూరు నియోజకవర్గ అరుంధతీయ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు తమ హర్షం వెలిబుచ్చారు.

## కిట్‌లు సకాలంలో పాఠశాలలకు చేరాలి



**రంగంపేట, (విశాఖ సమాచారమ్):–** పభ్రుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇచ్చే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు తయారీలో అప్రమత్తంగా ఉంటూ, సకాలంలో పాఠశాలలకు చేరే విధంగా కృషి చేయాలని రాష్ట్ర సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల డైరెక్టర్ ప్రతాపరెడ్డి సూచించారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి మిత్ర కిట్ల నిర్వ హణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థి, తరగతుల వారీగా కిట్లను కట్టలుగా కట్టి పంపిణీకి సిద్ధం చేసిన సమగ్రశిక్ష ఉద్యోగులు, పార్ట్‌టైమ్ ఇన్ స్ట్రక్టర్లు, సీఆర్పీలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటి వరకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, బెల్టులు, గ్రంథాలయ పుస్తకాలు, సామగ్రి చేరిందని, వాటిని పంపిణీకి సిద్ధం చేశామని మండల విద్యాశాఖాధికారి–2 పి.మధుసూధనరావు చెప్పారు. ఈ నెల 12వ తేదీలోపు పాఠశాల స్థాయికి కిట్లు అందే విధం గా చర్యలు తీసుకోవాలని ప్రతాపరెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష ఏఎంవో గౌరీశంకర్, మధ్యాహ్నం భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు, కాకినాడ జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, రంగంపేట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్ధసార?ధి, మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు, పార్ట్‌టైమ్ ఇన్ స్ట్రక్టర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఫలితాలతో విద్యార్థులో జోష్

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల కావడంతో విద్యార్థుల్లో జోష్ నింపుకుందని చెప్పవచ్చు. ఈ ఫలితాల్లో భాగంగా కాకినాడ జిల్లా రాష్ట్రస్థాయిలో 23 ( ఫస్ట్ ఇయర్ ), 5( సెకండ్ ఇయర్ ) స్థానాల్లో నిలిచింది. ఈ సప్లమెంటరీ పరీక్షలకు ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 6354 మంది పరీక్షలు రాయిగా 2 417 ( 38%) మంది పాసయ్యారు. సెకండ్ ఇయర్ 4760 మంది విద్యార్థులకు గాను 3341 (70%) ఉత్తీర్ణులయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి వెల్లడించారు.

## గోగులమ్మకు వెండి కిరీటం సమర్పణ

**రాజానగరం, (విశాఖ సమాచారమ్):–** స్థానిక రావుల చెరువు గట్టున కొలువైవున్న గోగులమ్మకు వెండి కిరీటాన్ని భక్తులు శుక్రవారం సమర్పించారు. రాజానగరంతోపాటు పలుప్రాంతాలకు చెందిన భక్తులంతా కలసి సుమారు రూ.4 లక్షలు విలువ చేసే 4 కిలోల బరువు ఉన్న ఈ కిరీటాన్ని శనివారం జరిగే తిరునాళ్లను పురస్కరించుకుని అమ్మవారికి కానుకగా సమర్పించారు. శని, ఆదివారాలలో ఇక్కడ గోగులమ్మ వారి జాతర, తిరునాళ్లు, వీరభద్ర స్వామి సంబరాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## మెగా డీఎస్సీ పరీక్ష ప్రశాంతం

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** మెగా డీఎస్సీ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమైంది. రాజమహేంద్రవరం లూథర్‌గిరిలోని రాజీవ్‌గాంధీ కళాశాల ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌కు 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సివుంది. అయితే 532 మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగి సెషన్‌కు 600 మంది హాజరుకావాల్సివుండగా 527 మంది పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖాదికారి కె.వాసుదేవరావును అడిగి తెలుసుకున్నారు.

## 12 వరకు వ్యవసాయ ఉత్పత్తులు పెంచేందుకు కృషి

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్, (విశాఖ సమాచారమ్):–** భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున వికసిత్ కృషి కార్యక్రమంలో భాగంగా ప్రీ ఖరీఫ్ ప్రచారాన్ని గత నెల 29 నుంచి ఈనెల 12వతేదీ వరకు చేపడుతున్నామని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(నిర్కా) డైరెక్టర్ డా.మాగంటి శేషుమాధవ్ అన్నారు. శుక్రవారం ఐకార్%–%నిర్కా( సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తలు 2,000కు పైగా జట్లుగా ఏర్పడి ప్రతీరోజు గ్రామాలను సందర్శిస్తూ, కార్యక్రమం ఖరీఫ్ సీజన్‌లో రైతుల ఆదాయాన్ని పెంచడానికి, స్థిరమైన వ్యవసాయం చేయడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయన్నారు. వికసిత్ కృషి ప్రోగ్రామ్ నోడల్ సైంటిస్ట్ డా.వై.సుబ్బయ్య పాల్గొన్నారు.

## వనదుర్గమ్మకు ఘనంగా చండీహోమం

**అన్నవరం, (విశాఖ సమాచారమ్):–** రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి ఘనంగా చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చండీ హోమం ప్రారంభించారు. హోమం అనంతరం 11 గంటలకు హోమగుండంలో ద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవార్లకు పండితులు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు, నైవేద్యం సమర్పించారు. వనదుర్గ అమ్మవారికి నిర్వహించిన హోమంలో 40 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో, కనకదుర్గకు అర్చకుడు హరగోపాల్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

## ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్ జగన్ వెంటే..

**దెందులూరు, (విశాఖ సమాచారమ్):–** తాను ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే, వైఎస్సార్‌సీపీ కే పనిచేస్తానని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. కొన్ని మీడియా సంస్థలు తాను పార్టీ మారుతున్నట్టు చేసిన దుష్ప్రచారాన్ని శుక్రవారం ప్రకటనలో ఖండించారు. ప్రాణం ఉన్నంత వరకూ తనకు, తన కుటుంబానికి ఎంతో ఇష్టమైన వైస్ జగన్ తోనే తన పయనం అన్నారు. తనకు వైఎస్సార్ కుటుంబానికి ఉన్న అనుబంధం విడదీయరానిదన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారాన్ని చేయటం బాధ కలిగించిందన్నారు. ఇది సిగ్గుచేటని అబ్బయ్య చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీనియర్ సిటిజన్ల పోస్టుకార్డు ఉద్యమం

**నరసాపురం,** సీనియర్ సిటిజన్లకు గతంలో మాదిరిగా రైలు చార్జీల్లో రాయితీ ఇవ్వాలని కోరుతూ అఖిల భారత సీనియర్ సిటిజన్స్ కార్పొరేషన్ పిలుపులో భాగంగా శుక్రవారం సంఘం నరసాపురం శాఖ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. రైలు చార్జీల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ ఇవ్వాలని ప్రధానికి పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంలో తపాలా శాఖ అధికారికి మొదటి పోస్టుకార్డు అందించారు. సంఘం నరసాపురం శాఖ అధ్యక్షుడు అందే రంగారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను తగు విధంగా గౌరవించి, వారి సంక్షేమం చూ డాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైలు చార్జీల్లో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు షేక్ సిలార్ సాహెబ్, పెన్మెత్స బాబూజీ, నెక్కంటి సుబ్బారావు, దాసిరి దేవరాజు, పితాని సత్యనారాయణ, కోట్ల చిరంజీవి పాల్గొన్నారు.

## 12న జాబ్‌మేళా

**ఉండి, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న అప్రెంటీస్, జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారితో పాటు ఫైనలియర్ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ లేదా అప్రెంటీస్ అడ్వయిజర్‌ను సంప్రదించాలని కోరారు.

## బక్రీద్ సందర్భంగా ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

త్యాగానికి ప్రతీక బక్రీద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** బక్రీద్ సందర్భంగా వన్ టౌన్, పేరిరోడ్ లో ఈద్గా లో ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల అనంతరం ముస్లిం కుటుంబ సభ్యులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక గా నిలిచిన పండుగ బక్రీద్ అని, అల్లాహ్ ఆదేశాన్ని పాటించిన ప్రవక్త ఇబ్రహీం త్యాగం గుర్తుచేస్తుందనీ అన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు ద్వారా లబ్ది చేకూరే కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాదిక్, పెద్దలు లడ్డు బాయ్ ,హీరా , హనీఫ్ తో పాటు జనసేన వార్డ్ అధ్యక్షులు చిన్న, బీజేపీ వార్డ్ అధ్యక్షులు రాజు, అధిక సంఖ్యలో ముస్లిం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కమనీయం- లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## విశాఖ కేంద్రంగా ఎకనామిక్ రీజియన్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నానికి సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించనున్నట్టే...ఇటు వైపు కాకినాడ వరకూ బీచ్ రోడ్డును నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశించారు. దీనిని జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని సూచించారు. అమరావతిలో శుక్రవారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో విశాఖ కేంద్రంగా ఎనిమిది జిల్లాలతో ఏర్పాటుచేయబోయే 'ఎకనామిక్ రీజియన్'పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**ఏయే జిల్లాలంటే...?**

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను ఎకనామిక్ రీజియన్‌గా ఏర్పాటు చేస్తారు. ఈ జిల్లాలో ఆర్థిక వ్యవహారాలు పెరిగేలా...తద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటారు. ఈ రీజియన్‌లో వివిధ పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం సుమారు లక్ష ఎకరాలను సమకూరుస్తారు. ఐటీ రంగంలో లక్షల మందికి ఉపాధి కల్పించేలా స్టార్టప్‌లు, డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ కేంద్రాలు నెలకొల్పుతారు. పోర్టులు, ఐటీ, పర్యాటకం, హెల్త్ కేర్, వ్యవసాయం, పట్టణీకరణ రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆయా రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. 2028-30 నాటికి విశాఖపట్నంలో 77 కి.మీ. పొడవున మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

## యోగాకు 5 లక్షల మంది సమీకరణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** నగరంలో ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఐదు లక్షల మంది పాల్గొనేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. విశాఖపట్నం జిల్లా నుంచి మూడున్నర లక్షల మందిని, అనకాపల్లి జిల్లా నుంచి 1.5 లక్షల మందిని, విజయనగరం నుంచి 30 వేలు, శ్రీకాకుళం జిల్లా నుంచి 20 వేల మందిని సమీకరించనున్నారు. ఐదు లక్షల మందికీ టీషర్టు (యోగా ప్రదర్శనతో కూడిన లేబుల్), మ్యాటు సరఫరా చేస్తారు. టీషర్టులు, మ్యాట్లు ఢిల్లీ నుంచి రెండు రోజుల్లో నగరానికి రానున్నాయి. వాటిని ఏయూ జిమ్నాజియం స్టేడియంలో భద్రపరచి, 15వ తేదీ తరువాత అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు. యోగా ప్రదన్శనకు ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్‌రోడ్ పొడవునా 29 కంపార్టుమెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. మరో నాలుగు ఇండోర్ స్టేడియాలు గుర్తించారు. నగరం, పొరుగు జిల్లాల నుంచి అభ్యాసకులు 21వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటలకల్లా బీచ్ రోడ్డులో కేటాయించిన కంపార్టుమెంట్లకు చేరుకోవాలి. ఇందుకు ఆరు వేల ఆర్టీసీ బస్సులు, మరో రెండు వేల ప్రైవేటు బస్సులు, పెద్ద సంఖ్యలో ఆటోలు, చిన్నపాటి వాహనాలు ఏర్పాటుచేస్తున్నారు. వాటి కోసం బీచ్ పొడవునా 51 పార్కింగ్ కేంద్రాలు గుర్తించారు. నగరంలో జన నమీకరణ బాధ్యతలు అన్ని ప్రభుత్వ శాఖలు, జీవీఎంసీ యూసీడీ, పాఠశాల విద్యా శాఖ, ఇంటర్ బోర్డు, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు, వర్సిటీ అధికారులకు అప్పగించారు. 21వ తేదీ ఉదయం 7.15 గంటలకు ప్రారంభం కానున్న ప్రదర్శన 8.15 గంటలకు ముగుస్తుంది.

# ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించిన కూటమి ప్రభుత్వం



**అనకాపల్లి:** ఎన్నికల్లో నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకంలో మెగా డీఎస్సీ ప్రకటించి ఎన్నికలు నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికి విద్య ఐటీ శాఖ మంత్రులు నారా లోకేష్ కి సాధ్యమైందని మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి బు ద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు ఈరోజు పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విద్యా ఐటీ శాఖ మంత్రులు నారా లోకేష్ కు అభినందనలు తెలియజేశారు మెగా డీఎస్సీ పరీక్షలను విశాఖ అనకాపల్లి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం అభినందనీయం ని అన్నారు వైసీపీ ప్రభుత్వం లో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ పాటిస్తామని జగన్ రెడ్డి మాటలు కోటలు దాటాయే తప్ప ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేకపోయినా సమర్థ ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి మిగిలారని నాటి విద్యాశాఖ మంత్రి బొ స్స సత్యనారాయణ బదిలీలు పేరుతో 50 కోట్ల ఉపాధ్యాయుల నుండి దోచుకున్నారని అదే కూటమి ప్రభుత్వంలో బదిలీలు పదోన్నతులు కూడా ప్రారంభించారని 27 వేల స్కూల్ అసిస్టెంట్ బదిలీల చట్టంతో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పాద దర్శకంగా బదిలీలు చేయడం కు టమి ప్రభుత్వానికే దక్కిందని నాగ జగదీష్ అన్నారు అదే విధంగా 4000 వేల మంది టీచర్లకు పదోన్నతులు కూడా కల్పించారని నూరు శాతం అక్షరా క్షేత్ర సాధన లక్ష్యంగా అక్షర ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమం రూపొందించడం శుభ పరిణామం అని నాగ జగదీష్ అన్నారు వైసిపి ప్రభుత్వం లో నూతన విద్యా విధానం పేరుతో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసి దీని మూలంగా ఆరు లక్షల మంది పేద విద్యార్థులు విద్యకు దూరం అయ్యారని అటువంటి పరిస్థితి రాకుండా ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో సమన్వయంతో చేసుకుంటూ ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను తీసుకొని ప్రజా సామ్రాజ్య బలంగా సంస్కారణము చేపట్టోడుతున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గా చెల్లింది అన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 12వ తేదీన తల్లికి వందనం జూన్ 12వ తేదీన విద్యా సంవత్సరం ప్రారంభం రోజున ఒకటవ తరగతి నుండి 12వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలు ఇతర పాఠశాలల్లో చదువుతున్న అందరికీ ఒక తల్లికి వందనం ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ వారి ఖాతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జమ చేస్తారని చెప్పిన ప్రకారం అమలు చేస్తున్న సంఘటన పారదర్శక ప్రభుత్వానికి నిదర్శమని నాగచైదీష్ అన్నారు ఈ కార్యక్రమంలో జోడి వెంకట్రావు మల్ల శివన్నారాయణ కాద్రేగుల ముకుంద కొంప మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలి

## జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడు




**అనకాపల్లి:–** ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో ఉదయం ఏడు గంటలకు జిల్లా విద్యా శాఖ సిబ్బంది మరియు ఉపాధ్యాయ సంఘాల తో యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యోగా ప్రదర్శన లో యోగ గురువు దొరమ్మ నాయుడు, బి అప్పారావు లు ఈ కార్యక్రమాన్ని నడిపిస్తూ యోగాలోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ అన్నీ కూడా చేసి చూపించి అందరితో చేయించడం జరిగింది.

జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ రోజు క్రమం తప్పకుండ యోగా సాధన చేస్తే మన ఆరోగ్యం అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. యోగ ప్రాధాన్యతను ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజు మనం పాఠశాలలో నిర్వహించే ప్రార్థన, డ్రిల్ కార్యక్రమాల్లో యోగా ప్రయోజనాల గురించి విద్యార్దులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఇందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగాంధ్ర - 2025 కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ కూడా పూర్తిస్థాయిలో పాల్గొనడం హర్షనీయమన్నారు. జిల్లా పరిధిలోని అన్ని విభాగాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ యోగా అవగాహనా కార్యక్రమాల్లో మన యోగాంధ్ర రాష్టం తొలి స్థానంలో ముందంజలో ఉంటే, రాష్ట్రంలో మన అనకాపల్లి జిల్లా ముందంజలో ఉందని అన్నారు.

జిల్లా ఆయుష్మాన్ అధికారిని డాక్టర్ కె లావణ్య మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేసిన ట్లయితే అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. రాబోయే జూన్ 21 వ తారీఖున విశాఖపట్నంలో జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం కి అందరూ సమాయత్తం కావాలని ప్రతి ఒక్కరితో యోగా యాప్ లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించడం జరిగింది.

అనంతరం జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి చిన్న నాలుగు రోడ్లు కూడలి వరకు నిర్వహించి యోగాంధ్ర పై ప్రజలను చైతన్య పరచడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో డి ఎస్ డి ఓ రమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, మహా లక్ష్మి నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఆయుష్, యోగా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో, భారీవర్షం



**అనంతగిరి, (విశాఖ సమాచారమ్):–** మండలంలో శుక్రవారం నాడు మధ్యాహ్నం 1 గంటల నుండి సాయంత్రం.4 గుంటల వరకు కురిసిన వర్షనికి రహదారి అంత జలమయమై చెరువుల్లా తలపించడంతొ జనజీవానికి అంతరాయం ఏర్పడింది.

దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు.

# రాగుల్లో దాగున్న 'ఆరోగ్యం'!



మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్ల కారణంగా చాలామంది చిన్న వయసులోనే పలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. వీటిని దూరం చేసుకోవాలంటే సరైన ఆహార నియమాలు పాటించాలని చెబుతున్నారు నిపుణులు. ముఖ్యంగా రాగుల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

రాగులతో జావే కాదు.. వివిధ రకాల వంటకాలు కూడా చేసుకోవచ్చు. కొంతమంది వీటిని ఇడ్లీ, దోసెల రూపంలో తీసుకుంటారు. రాగులతో లడ్డూ, కేక్, హల్వా, పూరీ, పరోటా.. వంటివీ చేసుకొని తీసుకుంటుంటారు మరికొందరు. రాగుల్లో శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల పలు ఆరోగ్య ప్రయోజనాల్ని పొందచ్చంటున్నారు నిపుణులు.

**ఎముకల దృఢత్వానికి..**

రాగుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది. అలాగే దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుంది. అందుకే ఎదిగే పిల్లలకు రాగులను క్రమం తప్పకుండా ఇవ్వాలంటున్నారు నిపుణులు. అలాగే వయసు మళ్లిన వారు కూడా రాగులను తీసుకోవడం ద్వారా ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు.

**బరువు అదుపులో..!**

అధిక బరువుతో బాధపడే వారు రాగులను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. రాగుల్లో ఫైబర్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటుంది. దానివల్ల రాగులు కొద్ది మొత్తంలో తీసుకున్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఫలితంగా ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలన్న కోరిక దరిచేరదు. అదే సమయంలో శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా అందుతాయి.

**గ్లూకోజ్ అదుపులో..**

బియ్యం, గోధుమలతో పోలిస్తే రాగుల్లో 'గ్లైసెమిక్ ఇండెక్స్' చాలా తక్కువగా ఉంటుంది. ఫలితంగా రక్తంలోని గ్లూకోజ్ స్థాయులు అదుపులో ఉంటాయి.

**గర్భిణులు, పాలిచ్చే తల్లులకు..**

రాగుల్లో క్యాల్షియంతో పాటు ఫోలిక్ యాసిడ్ కూడా అధికంగా ఉంటుంది. ఇది గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రాగుల్లో ఉండే ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే ఇందులో ఉండే క్యాల్షియం, ఐరన్, అమైనో ఆమ్లాలు పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరగడానికి దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**అందానికీ..!**

రాగులు కేవలం ఆరోగ్యానికే కాదు.. అందాన్నీ ద్విగుణీకృతం చేస్తాయంటున్నారు నిపుణులు. రాగుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫినోలిక్ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా కాపాడతాయి. అలాగే వీటిలో ఉండే అమైనో ఆమ్లాలు చర్మంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచి.. చర్మం ముడతలు పడకుండా చేస్తాయి.

## మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలుకుదాం

### మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే విజయ్ చంద్ర



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):–** 2025 పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన పార్వతిపురం మన్యం జిల్లా గిరిజన విద్యార్థులను స్వయంగా సన్మానించడానికి ఈ నెల 9న పార్వతీపురం వస్తున్న ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలుకుదామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మంత్రి పర్యటన సంబంధించి పార్వతిపురం కళ్యాణమండపంలో ఏర్పాట్లను శనివారం ఉదయం వారు పరిశీలించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన విద్యార్థులు రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ మార్కులు సాధించి రికార్డు నెలకొల్పారని వారిని స్వయంగా సన్మానించేందుకు మంత్రి లోకేష్ రావడం ప్రశంసనీయమన్నారు.

### విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మంత్రి లోకేష్. .. ఎమ్మెల్యే విజయ్ చంద్ర

**పార్వతిపురం, (విశాఖ సమాచారమ్):–** గత ఏడాదికాలంగా ఏపీ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని ఆ ఫలితాలు రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా నిలబెడతాయని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర స్పష్టం చేశారు. మంత్రి లోకేష్ చేపట్టిన సంస్కరణలతో గతంలో ఎప్పుడూ లేనివిధంగా పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని తెలిపారు. గుంటూరు, విజయవాడ, గోదావరి జిల్లాలకు మించిన ఫలితాలను మన గిరిజన విద్యార్థులు సాధించడం ప్రశంసనీయమన్నారు. అంతేకాక గిరిజన విద్యార్థులను స్వయంగా సన్మానించి వారిని ప్రోత్సహించేందుకు మంత్రి లోకేశ్ నేరుగా రావడం పార్వతీపురం విద్యార్థుల అదృష్టమని పేర్కొన్నారు. నారా లోకేష్ చేపట్టిన చర్యలతో గిరిజన విద్యార్థుల్లో నూతన ఉత్సాహం వెల్లువిరుస్తుందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. కళ్యాణ మండపంలో విద్యార్థులకు మంత్రి లోకేష్ స్వయంగా ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేసి నగదు ప్రోత్సాహకాలను అందిస్తారని తెలిపారు. ఆ తర్వాత టిడిపి ముఖ్య నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారని అనంతరం మరో కార్యక్రమంలో పాల్గొంటారని, సోమవారం సాయంత్రం ఏడు గంటల వరకు మంత్రి లోకేష్ పార్వతీపురంలో ఉంటారని ఆయన పర్యటనను విజయవంతం చేద్దామని కార్యకర్తలు నాయకులకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర సూచించారు.

## డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభం

### 88.39 శాతం హాజరు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో తొలిరోజు ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 2,447 మంది అభ్యర్థులకుగాను 2,163 మంది (88.39 శాతం) పరీక్షకు హాజరయ్యారు. నాన్ లాంగ్వేజ్ కేటగిరీలో గణితం, ఫిజికల్ సైన్స్ (ఆంగ్ల మాధ్యమం), లాంగ్వేజ్ కేటగిరీలో తెలుగు, హిందీ సబ్జెక్టులకు రాత పరీక్ష నిర్వహించారు. ఉదయంపూట పరీక్షకు 1,435 మందికిగాను 1,278 మంది, మధ్యాహ్నం 1,012 మందికిగాను 885 మంది హాజరయ్యారు. అభ్యర్థులను గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. డీఈవో ప్రేమ్‌కుమార్ ఒక కేంద్రాన్ని తనిఖీ చేశారు.

## చరిత్రలో ఈ రోజు (జూన్ 8)

% సంఘటనలు:

632: ఇస్లాం మతాన్ని స్థాపించిన మహమ్మద్ ప్రవక్త మదీనాలో పరమపదించాడు. ఆయన తరువాత కాలిఫ్ అభు బకర్ ఆయన బాధ్యతలు స్వీకరించాడు.

1958: ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు స్వీడన్లో ప్రారంభమయ్యాయి.

1990: ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు ఇటలీలో ప్రారంభమయ్యాయి.

జననాలు:

1911: మైలార మహాదేవప్ప, కర్ణాటకకు చెందిన విప్లవ వీరుడు.

1919: వేదాంతం రాఘవయ్య , తెలుగు చలన చిత్ర దర్శకుడు

1921: సుహార్తో, ఇండోనేషియా మాజీ అధ్యక్షుడు.

1924: డి.రామలింగం, రచయిత.

1927: లాల్ కృష్ణ అద్వానీ , రాజకీయాలలో లోహ పురుషుడు గా ప్రసిద్ది , మాజీ కేంద్ర హెూంశాఖ మంత్రి.

1946: గిరిబాబు, తెలుగు సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత.

1957: డిరపుల్ కపాడియా, భారత సినిమా నటి.

1959: మాడుగుల నాగఫణి శర్మ, అవధాని

1965: లక్ష్మణ్ ఏలె, భారతీయ చిత్రకారుడు.

1975: శిల్పా శెట్టి, భారత సినిమా నటి

మరణాలు:

1845: ఆండ్రూ జాక్సన్, అమెరికా మాజీ అధ్యక్షుడు

1938: బారు రాజారావు, స్వాతంత్ర్య సమరయోధుడు, అఖిల భారత జాతీయ కాంగ్రేసు కార్యాలయ కార్యదర్శి

1981: చివటం అచ్చమ్మ, అవధూత, యోగిని.

2002: భూపతిరాజు విస్సంరాజు, సంఘ సేవకుడు, పద్మభూషణ అవార్డు గ్రహీత.

2012: కె.ఎస్.ఆర్.దాస్, తెలుగు, కన్నడ సినిమా దర్శకుడు.

2015: దాశరథి రంగాచార్య, సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు.

2017: ఇందారపు కిషన్ రావు అవధాని, కవి, బహుభాషా కోవిదుడు.

2018: స్వాతంత్ర్య యోధుడు, మొదటి లోక్‌సభ సభ్యుడు కందాళ సుబ్రహ్మణ్య తిలక్ మరణం

2024: రామోజీరావు ఈనాడు గ్రూపు సంస్థల అధినేత.

**దినోత్సవాలు:**

ప్రపంచ సముద్ర దినోత్సవం .

అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ డే

2nd pages1.qxd 6/7/2025 7:40 PM Page 8



# ఇంగ్లాండ్ చేరుకున్న టీమ్ఇండియా



ఇంటర్నెట్ డెస్క్: త్వరలో ఇంగ్లాండ్ వేదికగా టీమ్ఇండియా ఐదు టెస్టులు ఆడనుంది. జూన్ 20 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే శుభ్‌మన్ గిల్ సారథిగా 18 మంది భారత జట్టును ప్రకటించారు. శుక్రవారం టీమ్ఇండియా ఆటగాళ్లు విమానంలో యూకేకు బయలుదేరగా.. శనివారం అక్కడికి చేరుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. 'భారత క్రికెట్ జట్టులో భాగం కావడం చాలా బాగుంది. ముఖ్యంగా ఈ టెస్టు సిరీస్‌లో యూకేకు స్వాగతం' అని సాయి సుదర్శన్ ఆ వీడియోలో అన్నాడు. సాయి సుదర్శన్ తొలిసారి టెస్టు జట్టులోకి ఎంపికైన సంగతి తెలిసిందే.

అయితే, శుక్రవారం భారత ఆటగాళ్లు లండన్ విమానం ఎక్కేముందు ముంబయి విమానాశ్రయంలో సందడి చేశారు. ఈసందర్భంగా ఓ అభిమాని రోహిత్ శర్మ ఎక్కడ? అని రిషభ్ పంత్‌ని ప్రశ్నించారు. దీనికి పంత్ 'గార్డెన్‌లో తిరగడానికి వెళ్లాడంటూ' జోక్ చేశాడు. 2024లో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఓ మ్యాచ్ సమయంలో జట్టులోని కుర్రాళ్లు సీరియస్‌గా లేకపోవడంతో గార్డెన్‌లో తిరగడానికి వచ్చారంటూ రోహిత్ ఆగ్రహం వ్యక్తంచేశాడు. అప్పటినుంచి ఈ డైలాగ్ బాగా ఫేమస్ అయింది. ఇప్పుడు పంత్ ఆ జోక్‌ను గుర్తుచేసి నవ్వించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకుండానే ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా తలపడనుంది. ఇటీవల వీరిద్దరూ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గిల్ సారథ్యంలో యువ ఆటగాళ్లతో కూడిన టీమ్ఇండియా.. ఇంగ్లాండ్ జట్టును ఏవిధంగా ఎదుర్కొంటుందో చూడాలి.

**ఇంగ్లాండ్, భారత్ ఐదు టెస్టుల సిరీస్ షెడ్యూల్ ఇదే..**

తొలి టెస్ట్ - 2025 జూన్ 20 - 24, వేదిక: హెడింగ్లీ, లీడ్స్

రెండో టెస్ట్ - 2025 జులై 2 - 6, వేదిక: ఎడ్జ్‌బస్టన్, బర్మింగ్‌హామ్

మూడో టెస్ట్ - 2025 జులై 10 - 14, వేదిక: లార్డ్స్, లండన్

నాలుగో టెస్ట్ - 2025 జులై 23 - 27, వేదిక: ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్

ఐదో టెస్ట్ - 2025 జులై 31 - ఆగస్ట్ 4, వేదిక: కెన్నింగ్టన్ ఓవల్, లండన్.

# హరిహర వీరమల్లు' @ రూ.250 కోట్ల బడ్జెట్: జ్యోతికృష్ణ



**ఇంటర్నెట్‌డెస్క్:** పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న పీరియాడికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హరిహర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు జ్యోతికృష్ణ మచిలీపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా బడ్జెట్ గురించి ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సుమారు రూ.250 కోట్లకు పైగా బడ్జెట్‌తో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

"పవన్ కల్యాణ్‌తో వర్క్ చేసే అవకాశం నాకు ఈ సినిమాతో దొరికింది. అదృష్టవంతుడిగా ఫీలవుతున్నా. ఇతరుల టాలెంట్‌ను ఆయన ఎంతగానో గుర్తిస్తారు. ఒక్కసారి నమ్మారంటే ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు. ఆయన నన్ను నమ్మారు. నాతో సినిమా చేశారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నా. ఇప్పటికే ఆయన సినిమా చూశారు. అది కూడా ఒక్కసారి కాదు మూడుసార్లు. దాదాపు గంటసేపు నన్నెంతో మెచ్చుకున్నారు. నాతో మరో సినిమా చేయాలని ఉందని చెప్పారు. ఆయన మాటలు నాకెంతో ఆనందాన్ని ఇచ్చాయి. బందరు పోర్ట్‌కు సంబంధించి మన సినిమాలో ఒక భారీ సీక్వెన్స్ ఉంది. కథకు తగిన విధంగా సీజీలో ఈ పోర్ట్ రీ క్రియేట్ చేయడానికి సుమారు రెండేళ్లు కష్టపడ్డాం. పోర్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రేక్షకులు ఫుల్ ఎంజాయ్ చేస్తారు. దీనికోసం ఆయన ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో ప్రాక్టీస్ చేశారు. మీకు మంచి చిత్రాన్ని ఇచ్చేందుకు ఆయన ఎంతో శ్రమించారు" అని జ్యోతికృష్ణ చెప్పారు.

హిస్టారికల్ యాక్షన్ మూవీగా ఈ సినిమా సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ కథానాయిక. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. రెండు భాగాల్లో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. జూన్ 12న దీనిని విడుదల చేయాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని శుక్రవారం టీమ్ ప్రకటించింది. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పింది.

# రవితేజతో ఆషిక



'అమిగోస్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఆషికా రంగనాథ్.. అగ్రతారల సరసన వరుస అవకాశాలు అందుకుంటూ జోరు చూపిస్తోంది. ఇప్పటికే నాగార్జునతో 'నా సామిరంగ'లో ఆడిపాడిన ఆమె.. ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'విశ్వంభర'లో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఇప్పుడామె మరో సీనియర్ స్టార్‌తో కలిసి తెర పంచుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి విధితమే. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. వినోదం నిండిన ఈ కుటుంబ కథా చిత్రంలో రవితేజ సరసన ఇద్దరు నాయికలకు అవకాశముంది. అందులో ఓ పాత్రకు కేతికా శర్మను ఎంపిక చేసినట్లు ఇటీవల వార్తలు రాగా.. ఇప్పుడు మరో పాత్ర కోసం ఆషికాను సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై ఆమెతో చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ఈ నెల 16నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానున్న నేపథ్యంలో.. త్వరలోనే కథానాయికల పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశముంది. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఆషిక ప్రస్తుతం తమిళంలో కార్తితో 'సర్దార్ 2' చిత్రంలో నటిస్తోంది. కన్నడలో 'గతవైభవ' అనే సినిమాని పూర్తి చేసింది.

# పాన్ వరల్డ్ హీరోయిన్ రీఎంట్రీ..



మలయాళంలో హీరోయిన్‌గా రంగప్రవేశం చేసి, టాలీవుడ్, కోలీవుడ్‌లను దాటి ఉత్తరాది భాషల్లోనూ తన కంటూ స్టార్ ఇమేజ్‌ను సంపాదించుకున్న తెలుగింటి ఆడపడుచు రంభ. సర్గం (1992) అనే మలయాళ చిత్రం ద్వారా కథానాయకిగా రంగప్రవేశం చేసిన ఈ బ్యూటీ అదే ఏడాదిలో తెలుగులో కూడా ఎంట్రీ ఇచ్చేశారు. ఆపై తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, బెంగాలీ, బోజ్‌పురి, ఆంగ్లం మొదలగు 8 భాషల్లో నటించి అప్పట్లోనే పాన్ వరల్డ్ కథానాయకిగా వెలిగారు.

అలా రెండు దశాబ్దాలకు పైగా అగ్ర కథానాయకిగా రాణించిన రంభ చివరిగా తమిళంలో పెణ్ సింగం (2010) అనే చిత్రంలో గెస్ట్ అప్పియరెన్స్ ఇచ్చారు. అలా 100కు పైగా చిత్రాల్లో నటించిన ఈమె 2010లో కెనడాకు చెందిన ఇంద్రకుమార్ పద్మనాధన్ అనే పారిశ్రామిక వేత్తను పెళ్లాడారు. ఆ తరువాత కూడా కొన్ని చిత్రాల్లో నటించిన రంభ 2017 తరువాత నటనకు దూరమయ్యారు. కాగా 49 ఏళ్ల రంభ ఇప్పుడు చెన్నైకి మకామ్ మార్చి మళ్లీ సినిమాలపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ నటించాలా, నిర్మాతగా చిత్రాలు నిర్మించాలా అనే సందిగ్ధంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈమె ఇంతకుముందు చిత్ర నిర్మాణం ప్రారంభించి త్రీ రోజెస్ అనే చిత్రాన్ని నిర్మించారన్నది తెలిసిందే.

అయితే, ఆ చిత్రం రంభను నిరాశపరిచింది. కొందరు దర్శకులు మాత్రం రంభ నిర్మించే చిత్రాలకు పనిచేయాలని ఆశపడుతున్నట్లు టాక్.. కారణం ఆమె భర్త వేల కోట్లకు అధిపతి కావడమేననే టాక్ మరో పక్క సామాజక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇకపోతే ఒక తమిళ చిత్రంలో పార్థిబన్, రంభ కలిసి నటించారు. అలా షూటింగ్‌కు వచ్చిన ఆమెను చూసిన పార్థిబన్‌తో పాటు తదితర సినీ ప్రముఖులు రంభ సార్ అంటూ ఆమెను తెగ అభిమానిస్తూ చుట్టుముట్టేశారు. అలాంటి రంభ ఇప్పుడు మళ్లీ నటించడానికి సిద్ధం అవుతున్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఫొటో షూట్ నిర్వహించి ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అవి ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

# మౌనంగా చూస్తూ ఉండలేం

## బెంగళూరు తొక్కిసలాట ఘటనపై బీసీసీఐ సీరియస్



**ఇంటర్నెట్‌డెస్క్:** బెంగళూరు తొక్కిసలాట ఘటన ఎన్నో కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో మార్గదర్శకాల జారీకి యోచిస్తోంది. ఆర్సీబీ విజయోత్సవ పరేడ్ వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. 11మంది మృతికి కారణమైన ఈ ఘటనను బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వేడుకల నిర్వహణకు మార్గదర్శకాల జారీకి ఆలోచన చేస్తోంది. ఈమేరకు బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా మీడియాతో మాట్లాడారు

"మేం మౌనంగా చూస్తూ ఉండలేం. ఏదోఒకటి చేయాలి. ఇది ఆర్సీబీకి సంబంధించిన ప్రైవేటు వ్యవహారం. కానీ ఈ దేశంలో క్రికెట్ వ్యవహారాలకు మేం బాధ్యత తీసుకోవాల్సిందే. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రయత్నిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై టీమ్ఇండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించిన సంగతి తెలిసిందే. "నేను ఆడేటప్పుడైనా.. ఇప్పుడైనా, భవిష్యత్తులోనైనా సరే.. విజయోత్సవ ర్యాలీలను నేను సమర్థించను. ఇలాంటివి ప్రజల జీవితాలను ప్రమాదంలో పడేస్తాయి. గెలవడం ముఖ్యం.. వేడుకలు కాదు. అన్నింటికంటే వ్యక్తుల జీవితాలు ముఖ్యం. కాబట్టి మనం ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా లేకపోతే.. ఈ రోడ్‌షోలు నిర్వహించకపోవడమే మంచిది" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. తాజాగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఇ.ఎస్. జైరాం తమ పదవులకు రాజీనామా చేశారు. ఆర్సీబీ యాజమాన్యం, కేఎస్‌సీఏ అధ్యక్షుడు రఘురామ్ భట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇప్పటికే బెంగళూరు నగర కమిషనర్ బి.దయానంద్‌ను సస్పెండ్ చేయగా.. సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శిని విధుల నుంచి తొలగించారు. మరికొందరు ఉన్నతాధికారులపైనా బదిలీ/సస్పెన్షన్ వేటు పడింది. ఇక, ఈ ఘటనకు సంబంధించిన ఆర్‌సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసలెతో పాటు డీఎన్‌ఏ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు సునీల్ మ్యాథ్యూ, కిరణ్, సుమంత్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

# కర్ణాటక క్రికెట్ సంఘం సెక్రటరీ రాజీనామా

## తొక్కిసలాట ఘటన




**బెంగళూరు:** ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులపై వేటుపడిన సంగతి తెలిసిందే. తాజాగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఇ.ఎస్. జైరాం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం వీరు ఓ ప్రకటన విడుదల చేశారు.

"గత రెండు, మూడు రోజులుగా ఊహించని, దురదృష్టకర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో మా పాత్ర పరిమితమైనదే అయినప్పటికీ.. నైతిక బాధ్యత వహిస్తూ మా పదవుల నుంచి వైదొలుగుతున్నాం. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడికి మా రాజీనామా లేఖలు పంపాం" అని శంకర్, జైరామ్ తమ ప్రకటనలో పేర్కొన్నారు.

చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆర్సీబీ యాజమాన్యం, కేఎస్‌సీఏ అధ్యక్షుడు రఘురామ్ భట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఇప్పటికే బెంగళూరు నగర కమిషనర్ బి.దయానంద్‌ను సస్పెండ్ చేయగా.. సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శిని విధుల నుంచి తొలగించారు. మరికొందరు ఉన్నతాధికారులపైనా బదిలీ/సస్పెన్షన్ వేటు పడింది.

ఇక, ఈ ఘటనకు సంబంధించిన ఆర్‌సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసలెతో పాటు డీఎన్‌ఏ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు సునీల్ మ్యాథ్యూ, కిరణ్, సుమంత్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, తమపై నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంస్థ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని పోలీసులు, ప్రభుత్వానికి సూచించిన న్యాయస్థానం తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది.

# నియోజకవర్గానికి విజన్ యాక్షన్ యూనిట్ ఏర్పాటు : కలెక్టర్

**అనకాపల్లి:** ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్లను 9వ తేది సోమవారం ప్రారంభించుటకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు.

శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గం కేంద్ర మండల అభివృద్ధి అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాసనసభ నియోజకవర్గ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్ లను శాసన సభ్యులచే ప్రారంభించుటకు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ యూనిట్ కు శాసనసభ్యులు చైర్మన్ గా వ్యవహరిస్తారని, నియోజవర్గ ప్రత్యేక అధికారి, కేటాయించిన ఐదుగురు సిబ్బంది యూనిట్లో ఉంటారని తెలిపారు. యూనిట్ లకు కేటాయించిన సిబ్బంది వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయిలో లో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్ లు సోమవారం నుండి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగించాలని తెలిపారు.

యూనిట్ ఏర్పాటుకు కావలసిన వసతి, ఫర్నిచర్, కంప్యూటర్లు సమకూర్చవలసిందిగా మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి జి. రామారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ కోఆపరేటివ్ బ్యాంకుకు షెడ్యూల్డ్ హోదా కోసం పాలకవర్గం కృషి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (వీసీబీ) ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.71.77 కోట్లు నికర లాభం కలిగి ఉందని వీసీబీ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం ద్వారకానగర్‌లో గల బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 55 బ్రాంచిలు గల తమ బ్యాంకు పరిధిలో 1,11,593 మంది సభ్యులున్నట్లు రాఘవేంద్రరావు వివరించారు. వీసీబీలో షేరు ధనం రూ.389.55 కోట్లు కాగా, డిపాజిట్లుగా రూ.4354.73 కోట్లు ఉన్నాయన్నారు. కాగా రూ.3436.47 కోట్లు రుణాలు అందించినట్టు తెలిపారు. ఇందులో 95 శాతం కోటి రూపాయల కంటే తక్కువ మొత్తం అందజేశామని పేర్కొన్నారు. సామాన్యులకు ప్రాధాన్యమిస్తూ లక్షా 30 వేల మంది రుణగ్రహీతలకు వారి అవసరాలకు తగినట్లుగా సేవలందిస్తూ వివిధ వర్గాల మన్ననలు వీసీబీ పొందుతున్నట్టు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి దాదాపు 7800 కోట్లకు ఆర్థిక లావాదేవీలు చేరుకున్నాయన్నారు. ఆరోగ్య బీమా పథకం ద్వారా వీసీబీ సభ్యులకు వైద్య బీమా అందిస్తున్నామని అన్నారు. మరణించిన సభ్యుల కుటుంబాలకు వారి షేరుధనానికి సమానంగా కనిష్టంగా రూ.5 వేలు, గరిష్టంగా రూ.లక్ష వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రమాదంలో మరణించిన సభ్యుల కుటుంబాలకు రూ.50 వేలు అదనంగా చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. సభ్యుల పిల్లలకు విద్యా పురస్కారాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు.

**రూ.8,600 కోట్ల ఆర్థిక లావాదేవీలు లక్ష్యం**

2025-26 ఆర్థిక సంవత్సరాంతానికి రూ.8600 కోట్లకు ఆర్థిక లావాదేవీలు చేర్చడం లక్ష్యం కాగా ఈ ఏడాది మరో 5 బ్రాంచిలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది చివరకు నూజివీడు, తెనాలి, అమలాపురం, హైదరాబాద్, విశాఖపట్నంలలో కొత్తగా ఐదు బ్రాంచిలను ప్రారంభించుకుని బ్రాంచిల సంఖ్య 60కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాఘవేంద్రరావు వివరించారు. భవిష్యత్‌లో నంద్యాల, అన్నమయ్య, సత్యసాయి, ఖమ్మం, నల్గొండ, వరంగల్ ప్రాంతాల్లో తమ బ్యాంకు సేవలను విస్తరించాలని భావిస్తున్నామని అన్నారు. నాన్ షెడ్యూల్డ్ హోదాలో ఉన్న తమ బ్యాంకుకు షెడ్యూల్డ్ హోదా కల్పించేందుకు వీలుగా ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపనున్నట్టు చెప్పారు. షెడ్యూల్డ్ హోదా ఉన్న బ్యాంకులతో పోల్చుకున్నా తమ బ్యాంకు అత్యధిక బ్యాంకుల కంటే అనేక అంశాల్లో మెరుగైన పనితీరును కనబరుస్తుందని రాఘవేంద్రరావు వివరించారు. తమ బ్యాంకు చోడవరంలో స్థలాన్ని కొనుగోలు చేసి కొత్తగా బ్రాంచిని ప్రారంభించిందన్నారు. గాజువాకలో బ్రాంచికు సొంత భవనాన్ని నిర్మించేందుకు వీలుగా కొనుగోలు చేసిన స్థలంలో నిర్మాణం ప్రారంభమైందన్నారు. గోపాలపట్నంలో కూడా 900 గజాల స్థలాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, త్వరలో నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. అమరావతి రాజధాని దృష్ట్యా విజయవాడ కేంద్రంగా కూడా బ్రాంచిలను ఏర్పాటు చేసేందుకు భవనాలను నిర్మించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ఆదివారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాలులో జరగనున్న 110వ మహాజన సభలో డివిడెండ్‌ను ప్రకటించనున్నట్టు రాఘవేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్నేని నాగభూషణ చౌదరి, ఏజే స్టాలిన్, నామాన కామరాజు, వి. చంద్రశేఖర్, జేవీ సత్యనారాయణమూర్తి, గుళ్లపల్లి జనార్ధనరావు, సిహెచ్. ఆదినారాయణ శాస్త్రి, పి. వెంకట రమణారావు, కే. ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతిదేవి, సి. కోటేశ్వరరావు, సి. కృష్ణమోహనరావు, ఎ.రామకృష్ణారావు, ఈమని అవని, పివి నరసింహమూర్తి, సిహెచ్. రామారావు, ఎన్. అంజయ్య, డైరెక్టర్ (కో ఆప్టెడ్) డా. రామమూర్తి వైద్యనాధన్, సీఈఓ వివిబి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com